RNI NO. TELTEL/2022/83470
manasakshi.in
మనసాక్షి
మీకోసం
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : మల్లె నాగిరెడ్డి

2 లో
కేజ్రీవాల్ ఇన్సులిన్ పిటిషన్‌పై విచారణ వాయిదా

2 లో
సెర్ఫ్ ఉద్యోగులకు హైకోర్టులో ఊరట

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 2. సంచిక :209 | శనివారం 20 ఏప్రిల్ 2024 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in

టచ్ చేసి.. చూడు..!

కేసీఆర్.. లెక్కపెట్టుకోండి

భారాసలో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారో కేసీఆర్ ప్రతిరోజూ సాయంత్రం లెక్కపెట్టుకోవాలని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

మీ ఎమ్మెల్యేలు ఎందరున్నారో రోజూ సాయంత్రం సరిచూసుకోండి

కాంగ్రెస్ శాసనసభ్యుల చుట్టూ హైటెన్షన్ వైరు లాంటి నేనున్నా

మా వారిని టచ్ చేస్తే మసైపోతారు

కాంగ్రెస్ గెలవకుండా భాజపా, భారాస కుట్ర

మహబూబ్‌నగర్, మహబూబాబాద్ సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

నా తెలంగాణ రైతు సోదరులకు భద్రాద్రి రాముడి సాక్షిగా, మంత్రి తుమ్మల సాక్షిగా మాట ఇస్తున్నా. పంద్రాగస్టులోపు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి.. రుణం తీర్చుకుంటా. బరాబర్ రూ.500 బోనస్ ఇచ్చి వడ్లు కొంటాం. మా వంద రోజుల పాలన చూడండి. అమలు చేసిన పథకాలు చూసి 14 స్థానాల్లో గెలిపించండి.

-సీఎం రేవంత్

2 లో

2 లో

ఫోన్ ట్యాపింగ్ అత్యంత ప్రమాదకరం

పౌరుల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడి వారిని నియంత్రించడానికి గత ప్రభుత్వ పాలకులు ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకున్నారని, అది అత్యంత ప్రమాదకరం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

కరెంటు రాకపోతే నా కార్యాలయానికి సమాచారం ఇవ్వండి

ప్రైవేటు స్కూళ్లలో ఫీజులను నియంత్రిస్తాం

మీడియాతో ముఖాముఖిలో ఉప ముఖ్యమంత్రి భట్టి

కిషన్ రెడ్డికి మనుషులు మాత్రమే తెలుసు

మతం, కులం రంగు లేదు

2 లో

దమ్ముంటే రాజీనామా చేసి రావాలి

కడియంశ్రీహరికి రాజయ్య సవాల్

వరంగల్: ,మనసాక్షి:ఓరుగల్లులో నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మరోసారి శివమెత్తారు. తన చిరకాల రాజకీయ ప్రత్యర్థి కడియం శ్రీహరి పై నిప్పులు చెరిగారు. మీసం మెలేసి తొడగొట్టిన రాజయ్య కడియం శ్రీహరిని భూస్థాపితం చేసే వరకు వదిలే ప్రసక్తే లేదన్నారు. దమ్ముంటే తన పదవికి రాజీనామా చేసి తనతో పోటీకి దిగాలని సవాల్ విసిరారు.. ఒకవైపు మాటల తూటాలు మరోవైపు తనదైన శైలిలో స్టెప్పులేసి గులాబీ శ్రేణుల్లో జోష్ నింపారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ రాజయ్య, దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈల కొట్టి స్టెప్పులేసిన రాజయ్య.. కేసీఆర్ పాటకు తనదైన శైలిలో డ్యాన్స్ చేసి, బిఆర్ఎస్ కార్యకర్తల్లో జోష్ నింపారు. రాజయ్యతో పాటు, అక్కడే ఉన్న నేతలు సైతం స్టెప్పులు వేశారు. బీఆర్ఎస్ పార్టీలోకి రీ-ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఫుల్ జోష్‌లో ఉన్న తాటికొండ రాజయ్య ఇప్పుడు ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో స్టార్ క్యాంపెనర్‌గా మారారు. తన చిరకాల రాజకీయ ప్రత్యర్థి కడియం శ్రీహరిపై రాజయ్య రంకెలేస్తున్నారు. ఈ మేరకు తొడగొట్టి సవాల్ విసిరిన మాజీ ఎమ్మెల్యే.. నమ్మకద్రోహం చేసిన కడియం అంతుచూస్తా.. నిన్ను భూస్థాపితం చేయడమే నా లక్ష్యం అని అన్నారు. కడియంకు నిజాయితీ ఉంటే రాజీనామా చేసి రా చూసు కుందాం అని మీసం మెలేసి సవాల్ విసిరారు.తెలుగు రాష్ట్రాల్లో అంతా మన ఇద్దరి కోసమే ఎదురు చూస్తున్నారు. దమ్ముంటే రా అని సవాల్ విసిరారు. నాకు నేనుగా.. రాజకీయ ఆత్మహత్య చేసుకునేలా చేసిన దుర్మార్గుడు కడియం నిన్ను వదిలే ప్రసక్తే లేదు. రేవంత్ రెడ్డి అభయహస్తం అంటున్నాడు.. కానీ కడియం శ్రీహరి లాంటి భస్మాసురుడు పక్కన చేరాడు జాగ్రత్త.

ఎన్నికల ప్రచారం కోసం కెసిఆర్ బస్సుయాత్ర

22నుంచి మే 10 వరకు రాష్ట్రంలో ప్రచారం

ఇసికి నివేదించిన బిఆర్ఎస్ ప్రతినిధి

హైదరాబాద్,మనసాక్షి:లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ అధినేత, కె.చంద్రశేఖర్‌రావు ఈనెల 22 నుంచి మే 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహించనున్నారు. కెసిఆర్ బస్సు యాత్రకు అనుమతి కోసం బిఆర్ఎస్ అధికార ప్రతినిధి కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్‌ను కలిశారు. ఈ మేరకు బస్సు యాత్ర వివరాలను వికాస్ రాజ్‌కు వాసుదేవా రెడ్డి అందజేశారు. కెసిఆర్ యాత్రకు తగిన భద్రత కల్పించాలని సిఇఒను కోరారు.యాత్రకు పోలీసుల సహకారం అందించేలా చూడాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైతే కేంద్ర బలగాలను మోహరించి ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వికాస్ రాజ్‌ను కోరినట్లు వాసుదేవరెడ్డి తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని వాసుదేవా రెడ్డి సిఇఒను కోరారు. బస్సు యాత్ర ద్వారా ప్రజలకు కెసిఆర్ భరోసా కల్పిస్తారన్నారు. పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక పోయిందని వాసుదేవరెడ్డి ఆరోపించారు.కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలే ప్రధాన అస్త్రాలుగా బిఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేపట్టనుంది.

అబద్ధాలతో పోటీపడుతున్న కాంగ్రెస్

రైతురుణమాఫీపై భట్టి వ్యాఖ్యలపై హరీష్ రావు ఖండన

హైదరాబాద్,మనసాక్షి: కాంగ్రెస్ పాలనలో అబద్ధాల పోటీ కొనసాగుతోందని బిఆర్ఎస్ అగ్రనేత, సిద్దిపేట ఎంఎల్ఎ టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతుల రుణమాఫీపై సిఎం, డిప్యూటీ సిఎం పోటీపడి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఎక్స్ వేదికగా విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, నూరు అబద్ధాలతో సమానమని మరోసారి నిరూపితమైందని వ్యాఖ్యానించారు. అబద్ధాల్లో సిఎం రేవంత్ రెడ్డితో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పోటీ పడుతున్నారన్నారు. నిరుద్యోగ భృతిపై కాంగ్రెస్ పార్టీ ఎలాంటి హామీ ఇవ్వలేదని నిండు అసెంబ్లీలో ప్రకటించి అభాసుపాలైన భట్టి.. తాజాగా రుణమాఫీపై కూడా నాలుక మడత పెట్టారని పేర్కొన్నారు. వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వలేదని భట్టి విక్రమార్క చెప్పడం 70 లక్షల మంది రైతులను ఘోరంగా వంచించడమే అని మండిపడ్డారు. డిసెంబర్ 9నే 2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడి హోదాలో చెప్పడమే గాక, ముఖ్యమంత్రిగా మొదటి సంతకం రుణమాఫీపైనే అని చెప్పిన విషయం భట్టికి తెలియనట్టు నటించడం హాస్యాస్పదం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏరు దాటే దాకా ఓడ మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లు ఉంది కాంగ్రెస్ నాయకుల పరిస్థితి అని విమర్శించారు. ఎన్నికల ముందు హామీల వర్షం గుప్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ, అయిపోయాక మొండి చేయి చూపిస్తున్నదని పేర్కొన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తప్పక బుద్ధి చెబుతారని అన్నారు. నిన్న నిరుద్యోగ భృతిపై ఎగవేత ? నేడు రైతు రుణ మాఫీపై దాట వేత ధోరణి ప్రదర్శిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నేతల మోసాలకు ఇవిగో సాక్ష్యాలు అంటూ హరీశ్‌రావు ఎక్స్‌లో వీడియోను పోస్టు చేశారు.

2 లో

నన్ను గెలిపించండి..

సికింద్రాబాద్ ఎంపీగా

మీ నమ్మకాన్ని నిలబెడుతాను

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

టచ్ చేసి.. చూడు..!

మహబూబాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యేల జోలికి వస్తే సహించేది లేదని.. భారాసలో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారో కేసీఆర్ ప్రతిరోజూ సాయంత్రం లెక్కపెట్టుకోవాలని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో తమ పార్టీ అల్లాటప్పాగా అధికారంలోకి రాలేదని.. మరో పదేళ్లపాటు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని గుర్తుపెట్టుకోవాలని కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైనా మాజీ సీఎం తీరు మారలేదన్నారు. 'కాంగ్రెస్ ఎమ్మెల్యేలంటే.. గతంలో మాదిరి గొర్ల మందలోకి వచ్చి ఒక్కో గొర్రెను తీసుకెళ్లిపోయినట్లు అనుకుంటున్నారేమో! కాంగ్రెస్ ఎమ్మెల్యేల చుట్టూ హైటెన్షన్ వైరు లాంటి రేవంత్‌రెడ్డి కాపలా ఉన్నాడు.. మా ఎమ్మెల్యేల్ని టచ్ చేస్తే మాడి మసైపోతారు' అని ఆయన హెచ్చరించారు. శుక్రవారం ఉదయం మహబూబ్‌నగర్‌లో వంశీచంద్‌రెడ్డి నామినేషన్ వేసిన సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. ఆ తర్వాత మహబూబాబాద్‌లో బలరాంనాయక్ నామినేషన్ అనంతరం సాయంత్రం నిర్వహించిన జనజాతర బహిరంగ సభలోనూ సీఎం మాట్లాడారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ సహా రాష్ట్రంలోని 14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. దిల్లీలో మోదీ, ఇక్కడ కేసీఆర్ కలిసి తెలంగాణకు అన్యాయం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రత్యక్షంగా కొట్లాడితే సీట్లు రావని.. ఆ ఇద్దరూ చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ గెలవకుండా భాజపా, భారాస ఒక్కటై కుట్రలు చేస్తున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ని ఓడించామని, ఇప్పుడు మోదీని ప్రజలు ఓడించాలని కోరారు.

వంద రోజులకే బిగిపామ్మంటారా?

భారాస విస్తృతస్థాయి సమావేశంలో గురువారం కాంగ్రెస్‌ను ఉద్దేశించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. "చిటికె వేస్తే 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భారాసలోకి వస్తారా? ఇంకా ఎన్నిరోజులు ఇలా మాట్లాడతారు. మీరు చెప్పే కథలకు కాలం చెల్లింది. మీ ఎమ్మెల్యేలు ఎంతమంది ఉన్నారో ఇక ప్రతిరోజు సాయంత్రం లెక్కబెట్టుకోండి" అని సవాల్ విసిరారు. ఇప్పుడున్నది అప్పటి కాంగ్రెస్ కాదని, తమ ఎమ్మెల్యేల జోలికి వస్తే మాడిమసైపోతారంటూ హెచ్చరించారు. "ఆరు గ్యారంటీల్లోని హామీల్లో ఐదింటిని వంద రోజుల్లో అమలు చేశాం. వంద రోజుల్లో గ్యారంటీలు అమలు చేయడం లేదని, కుర్చీలోంచి దిగిపోవాలని కొందరు అంటున్నారు. కార్యకర్తలు కూర్చోబెడితే ఆ కుర్చీలో కూర్చున్నాం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పదేళ్లు అధికారంలో ఉంటుంది' అని స్పష్టం చేశారు.

కారు వెళ్లేది తుక్కు దుకాణానికే..

"మొన్నటి ఎన్నికల్లో కారు పార్టీని ఓడించినా ఆయన(కేసీఆర్)లో మార్పు రాలేదు. మరమ్మతులు చేయలేని స్థితిలో కారు ఉంది. కారు కొంచెం ఖరాబ్ అయిందని కేటీఆర్ అన్నారు. మీ కారు వర్క్‌షాప్ నుంచి ఇంటికి కాదు.. తుక్కు దుకాణానికే వెళ్లాలి" అని వ్యాఖ్యానించారు.

తెలంగాణ ద్రోహుల పార్టీ భాజపా

"తెలంగాణ ద్రోహుల పార్టీ భాజపా. రాష్ట్రానికి నిధులివ్వలేదు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ వంటి విభజన చట్టంలోని హామీల్ని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అమలు చేయలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మోదీ, కిషన్‌రెడ్డిలు జాతీయ హోదా ఇచ్చారా? సోనియా గాంధీ మంజూరు చేసిన బయ్యారం ఫ్యాక్టరీని పదేళ్లు పాతరేసిన దద్దమ్మలు భాజపా నేతలు. కాజీపేటకు సోనియాగాంధీ కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేస్తే.. దాన్ని మోదీ లాతూర్‌కు తరలించుకుపోయారు. ఐటీఐఆర్, పాలమూరు ఎత్తిపోతల పథకం, మూసీ అభివృద్ధి.. ఇలా అనేక ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నిర్లక్ష్యంతో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. తెలంగాణ ఏర్పాటును ప్రధాని మోదీ పార్లమెంటులో అవమానించారు. నేనే ప్రత్యక్ష సాక్షిని. తల్లిని చంపి బిడ్డను బతికించారని అన్నారు. పార్లమెంటు తలుపులు మూసి తెలంగాణ ఇచ్చారని, ఆ బిల్లు చెల్లదనీ అన్నారు. తెలంగాణ ఏర్పాటును ప్రశ్నించిన భాజపా నాయకులు.. ఎలా ఓట్లడుగుతారు?

ఇద్దరు తోడు దొంగల గూడుపుఠాణి

దిల్లీలో ఉండే మోదీ.. గజ్వేల్‌లో ఉండే కేసీఆర్ తోడుదొంగలు. గూడుపుఠాణి చేసి.. తెలంగాణ ప్రజల హక్కుల్ని కాలరాశారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు దోచుకుంటుంటే పట్టుకుని కటకటాల్లోకి నెట్టి ఊచలు లెక్కపెట్టించాల్సిన మోదీ ఏం చేశారు? కేసీఆర్ ఇచ్చిన కమీషన్లకు కక్కుర్తి పడి.. దోపిడీకి అనుమతి ఇచ్చారు. రైతు వ్యతిరేక చట్టాలు, నోట్ల రద్దు, జీఎస్టీ, ట్రిపుల్ తలాక్, 370 అధికరణ రద్దు.. ఇలాంటి బిల్లులకు పార్లమెంటులో మోదీకి అండగా నిలబడి భాజపా ప్రభుత్వాన్ని గెలిపించింది.. భారాస ఎంపీలు కాదా? మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తండ్రిని (రెడ్యానాయక్‌ను) ఇటీవలి ఎన్నికల్లో ఇంటికి పంపారు. కవితనూ ఇంటికి పంపించే బాధ్యతను కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకుంటారు.

14 స్థానాల్లో గెలిపించండి

పింఛన్లు ఇవ్వాలన్నా, ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నా, యువతకు ఉద్యోగాలు రావాలన్నా, పరిశ్రమలు రావాలన్నా.. రాష్ట్రంలోని 14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించాలి. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ న్యాయపోరాటం చేస్తోంది. వర్గీకరణను సాధించే బాధ్యత నాతో పాటు పార్టీ నేత సంపత్‌కుమార్‌ది. పాలమూరును అభివృద్ధి చేసే బాధ్యత నాది.

తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ

ఏపీలో కాంగ్రెస్ మనుగడ కోల్పోతుందని తెలిసినా ప్రత్యేక తెలంగాణను సోనియా గాంధీ ఏర్పాటు చేశారు. ఆమె రాష్ట్రం ఇచ్చిన దేవత. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు.. లోక్‌సభ ఎన్నికల్లో మోదీని, భాజపాను ఓడించడానికి సర్వశక్తులు కూడగడుతున్నాం. జూన్ 4న ఫలితాలు సాధించి.. రాహుల్ గాంధీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తారు. తెలంగాణ నుంచి 14 మంది ఎంపీలతో నేను, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల దిల్లీ వెళ్లి.. ఆ పండగలో పాల్గొంటాం.

రైతుల్ని కాల్చిచంపిన మోదీ

రైతుల ఆదాయాన్ని మోదీ రెట్టింపు చేశారా? రైతుల్ని దిల్లీలో కాల్చిచంపారు. స్విస్ బ్యాంకులో నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షల చొప్పున వేస్తానన్నారు. ఏ ఒక్కరికీ పైసలివ్వని ఆయన మూడోసారి ప్రధాని అవుతారా? రాష్ట్రంలో మేం ఇచ్చిన మాట ప్రకారం..

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రూ.22,500 కోట్లతో ప్రారంభించాం. మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలిచ్చాం. మిగతా కొన్ని కార్యక్రమాలు చేయడానికి ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. సంవత్సరం తిరిగేసరికే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తాం. బీసీల జనాభాను బట్టి నిధులిస్తాం. ఆ బాధ్యత నాది" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ అత్యంత ప్రమాదకరం

హైదరాబాద్: పౌరుల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడి వారిని నియంత్రించడానికి గత ప్రభుత్వ పాలకులు ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకున్నారని, అది అత్యంత ప్రమాదకరం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఏర్పాటుచేసిన మీడియాతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "చాలామందిని ఫోన్‌ట్యాపింగ్ ద్వారా బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు వసూలు చేశారని పత్రికల్లో కూడా వచ్చింది. ఇలాంటివి ఏ పాలకులు చేసినా ఖండించాల్సిందే. మిగతా వారికన్నా తెలంగాణ సమాజం భావస్వేచ్ఛను, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ఎక్కువగా కోరుకుంటుంది. గత ప్రభుత్వం వ్యక్తిగత జీవితాల్లో, రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కుల్లో కూడా చొరబడింది. ఫోన్‌ట్యాపింగ్ చేయాల్సిన అవసరం, కర్మ మాకు లేవు. అందరూ సర్వస్వతంత్రంగా బతకాలని మేం కోరుకుంటున్నాం. వారి ఆలోచనలే మిగతావారికి ఉంటాయని ఊహించుకుని భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తోందని మాట్లాడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చాలా మంచిపనులు చేస్తున్నారు. ఆయన ప్రధాని మోదీని కలిశారని కావాలని రాజకీయ అభాండాలు వేస్తున్నారు. ఇలా ఆరోపణలు చేసేవారికి పరిపక్వత లేదనుకుంటున్నాం. రుణమాఫీ గురించి స్పష్టత ఉంది. వంద రోజుల్లోనే చేస్తామని చెప్పలేదు. ఆర్థిక పరిస్థితిని చూసుకుని తప్పకుండా రుణమాఫీ చేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ నెల 15 వరకు ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, సంక్షేమ పథకాల రాయితీలు కలిపి మొత్తం రూ.66,507 కోట్లు ఖర్చు పెట్టాం.

ఫేక్ న్యూస్ సృష్టించేవారిపై కేసులు

కరెంటు కోతలు విధిస్తున్నారని సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాపింపజేసేవారిపై కేసులు పెట్టాలని విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలకు గట్టిగా సూచించా. ఎవరికైనా కరెంటు రాక ఇబ్బందులుంటే సీఎండీలకు గానీ, నా కార్యాలయానికి గానీ సమాచారం ఇస్తే వెంటనే సరిచేస్తాం. కరెంటు కోతలు విధిస్తున్నారని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై నేను విచారణ చేయిస్తే వాటిలో నిజం లేదని తేలింది.తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు పెడతాం

గత భారాస ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు కట్టే కార్యక్రమాన్ని మాకు అప్పగించింది. మేం ఆ పనిలో ఉన్నాం. విద్య, వైద్యం మా ప్రభుత్వానికి ప్రాధాన్య రంగాలు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు పెడతాం. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణపైనా దృష్టి పెట్టాం. మొత్తం స్టడీ చేయాలని, నియంత్రించాలని అధికారులకు చాలా స్పష్టంగా చెప్పాం.నదీ జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం

నీటి వనరుల్లో అన్యాయం జరుగుతుందనే ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడాం. నదీ జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. కోడ్ తర్వాత ఆ ప్రకారం మా నిర్ణయాలు ఉంటాయి. వానాకాలంలో పడిన వర్షపునీటిని గత ప్రభుత్వం కాపాడలేదు. అలా చేయకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే కరవు అని ఇప్పుడు కొందరు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను కలిపి చేపట్టాలి. గతంలో కాంగ్రెస్ పాలనలో ఇలాగే జరిగింది. కానీ మధ్యలో మిడిమిడి జ్ఞానంతో, న్యారో మైండ్‌తో వచ్చిన రాజకీయ పార్టీలు అలా చేయకపోవడం వల్ల ఇప్పుడు సమస్యలు వచ్చాయి.రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు ఇవ్వాలని సంకల్పించాం. మానవ వనరులను సక్రమంగా పెంచి పోషిస్తే వారి ద్వారా లెక్కలేనంత ఆదాయం వస్తుంది. కొంతమంది లోతుల్లోకి పోకుండా సంక్షేమానికి నిధులు దుబారా చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. మా పథకాలు పేదలను ఆర్థికంగా నిలబెట్టడానికే తప్ప ఎవరో కొందరు వ్యక్తులకు దానం చేయడానికి కాదు.కేంద్రం నుంచి రూ.10 లక్షల కోట్లు వచ్చిందన్నది పచ్చి అబద్ధంకేంద్రం నుంచి గత పదేళ్లలో రూ.10లక్షల కోట్లు వచ్చినట్లు కొందరు చెపుతున్న మాటలు పచ్చి అబద్ధం. వచ్చింది రూ.3.70లక్షల కోట్లే. అవీ మనకు హక్కుగా రావాల్సినవే. గత భారాస ప్రభుత్వం దిగిపోయేటప్పుడు రూ.3,690 కోట్ల లోటు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని మాకు అప్పజెప్పింది. మరి రైతుబంధుకు కేటాయించిన రూ.7వేల కోట్లు ఏమయ్యాయి? మీరే(కేసీఆర్) తిన్నారా? ఎవరి దగ్గర ఉన్నాయో ప్రజలకు చెప్పండి. ఎన్టీపీసీని విస్మరించి యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలను ఎవరి ప్రయోజనాల కోసం ప్రారంభించారు? రాష్ట్రానికి కొత్త విద్యుత్తు పాలసీ తెస్తాం. గత ప్రభుత్వం చేసిన పాత బాకీలకు కిస్తీల కింద నాలుగు నెలల్లో రూ.26,374 కోట్లు చెల్లించాం. ఎవరెన్ని కుట్రలు చేసినా మా ప్రభుత్వానికి ఐదేళ్ల దాకా ఢోకా లేదు. రైతుల ఆత్మహత్యలు అనేవి నిరాధారమైన ఆరోపణలు మాత్రమే. 65 లక్షల మందికి రైతు భరోసా కింద రూ.5,575 కోట్లను జమ చేశాం" అని భట్టి విక్రమార్క చెప్పారు.

కిషన్ రెడ్డికి మనుషులు మాత్రమే తెలుసు

మతం, కులం రంగు లేదు: ఈటల

హైదరాబాద్,: కిషన్ రెడ్డికి మతం, కులం, రంగు లేదు.. ఆయనకు మనుషులు మాత్రమే తెలుసని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్ రెడ్డి నామినేషన్ సందర్భంగా సభలో రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఎంపీ లక్ష్మణ్, ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కిషన్ రెడ్డికి మనుషులు మాత్రమే తెలుసు.. మతం, కులం రంగు లేదని అన్నారు. 2004 నుంచి 2014 వరకు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోకుండా నేను కిషన్ రెడ్డి ఇద్దరం గెలిచామన్నారు. 2019లో ఆయన తప్పిపోయాడు.. నేను మొన్న తప్పిపోయా అన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయలను భుజం మీద పెట్టుకుని నడిపిస్తున్నాడు కిషన్ రెడ్డి అని తెలిపారు.కిషన్ రెడ్డికి మతం కులం రంగు లేదు.. ఆయనకు మనుషులు మాత్రమే తెలుసన్నారు. ప్రజల కోసం ఆయన నిరంతరం కష్టపడుతాడని తెలిపారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు నాకు ప్రజా సమస్యల మీద లెటర్స్ ఇచ్చే వాడని తెలిపారు. కిషన్ రెడ్డిని గెలిపించాలని కోరుతున్నానని ఈటల పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో 11వ స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు ఐదో స్థానానికి రావడం నరేంద్ర మోడీ కృషికి నిదర్శనమని అన్నారు. ఈసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం వస్తే ప్రపంచంలోనే మూడో స్థానానికి వస్తుందని స్పష్టం చేశారు. గతంలో భారతదేశాన్ని పట్టించుకునే వారు లేరు. కానీ నేడు ప్రపంచం మొత్తం మోడీ వైపు చూస్తోందని, దేశాల మధ్య యుద్ధాల నివారణకు కూడా మన మోడీని ఆశ్రయించడం మన భారతీయులందరికీ గర్వకారణమని తెలిపారు.

కేజ్రీవాల్ ఇన్సులిన్ పిటిషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ,: ఇన్సులిన్ అందించాలంటూ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను రౌస్ అవెన్యూ కోర్టు విచారించింది. కేజ్రీవాల్ న్యాయవాదులు.. ఈడీ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. కేజ్రీవాల్ తరపున అభిషేక్ సింఘ్వీ, రమేష్ గుప్తా వాదనలు వినిపించారు. అనంతరం తీర్పును న్యాయస్థానం సోమవారానికి రిజర్వ్ చేసింది. తీవ్రమైన మధుమేహం, రక్తంలో చక్కెర స్థాయి హెచ్చుతగ్గులకు సంబంధించి ప్రతిరోజూ 15 నిమిషాల పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యక్తిగత వైద్యుడ్ని సంప్రదించేందుకు.. అలాగే ఇన్సులిన్‌ను ఎక్కించేందుకు జైలు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం విచారించిన ధర్మాసనం.. పిటిషన్‌పై ఢిల్లీ రూస్ అవెన్యూ కోర్టు జడ్జి కావేరి బవేజా ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. డైట్ చార్ట్ ప్రకారమే కేజ్రీవాల్‌కు ఫుడ్ అనుమతి ఇస్తున్నట్లు జైలు తరపు లాయర్ వాదనలు వినిపించారు. షుగర్ లెవెల్స్ జైలు డాక్టర్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారని తెలిపారు. కేజ్రీవాల్ ఆరోగ్యం మెరుగ్గానే ఉందని.. షుగర్ లెవెల్స్ మెయింటెన్స్ అవుతున్నాయని వెల్లడించారు. ఎయిమ్స్ నివేదిక ప్రకారం మ్యాంగో, బనానాలతో పాటు కొన్ని ఆహార పదార్థాలు షుగర్ ఉన్నవారు తీసుకోవద్దని జైలు తరపు లాయర్ పేర్కొన్నారు. అవసరం అయితే జైల్లో ఇన్సులిన్ కూడా ఇస్తామని పేర్కొన్నారు.ఇదిలా ఉంటే ఇదే అంశంపై గురువారం కూడా ఈడీ తరపు పలు వాదనలు వినిపించారు. కేజ్రీవాల్ జైల్లో మామిడి పండ్లు, తీపి పదార్థాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. మెడికల్ బెయిల్ పొందేందుకే ఇలా చేస్తున్నారని ఈడీ తెలిపింది. అయితే ఈడీ ఆరోపణలను ఆప్ ఖండించింది. ప్రధాని మోడీ ఆదేశాలతో కేజ్రీవాల్‌ను తీహార్ జైల్లో చంపేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుల్లో కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు రెండు సార్లు ఈడీ కస్టడీకి అనుమతి ఇచ్చింది. అనంతరం ఏప్రిల్ 1న కేజ్రీవాల్‌ను జ్యుడీషియల్ కస్టడీ విధించగా తీహార్ జైలుకు తరలించారు. ఇక బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టు తీసిపుచ్చాయి. తాజాగా ఇన్సులిన్ తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని రౌస్ అవెన్యూ కోర్టును కోరగా.. తీర్పును సోమవారానికి రిజర్వ్ చేసింది.

సెర్ప్ ఉద్యోగులకు హైకోర్టులో ఊరట

అందిరినీ విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆదేశం

హైదరాబాద్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే అభియోగాలతో సిద్దిపేటకు చెందిన 106 మంది ఐకేపీ, డీఆర్డీఏ ఉద్యోగులు సస్పెన్షన్ కు గురి కాగా వారికి తెలంగాణ హైకోర్టులో వారికి ఊరట లభించింది. ఈసీ విధించిన సస్పెన్షన్ ను ఉద్యోగులు హైకోర్టులో సవాల్ చేయగా.. అందరినీ తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సమావేశంలో ఉపాధి హామీ, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారనే అభియోగాలతో ఈసీ ఆదేశాల నేపథ్యంలో కలెక్టర్ ఒకే రోజు 106 మందిపై సస్పెన్షన్ వేటు వేయగా.. ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఈసీ నిర్ణయంపై స్టే విధించిన హైకోర్టు.. తదుపరి విచారణను జూన్ 18కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. ఈ నెల 7న సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్ లో ఉపాధి హామీ, సెర్ప్ ఉద్యోగులతో మెదక్ లోక్ సభ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, సుడా మాజీ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, మరికొందరు నాయకులు సమావేశం నిర్వహించారు. ఇది బహిర్గతం కావడంతో వెంకట్రామిరెడ్డి, రవీందర్ రెడ్డిపై కేసు నమోదైంది. అయితే, ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో.. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ సభల్లో పాల్గొనడంపై ఎన్నికల కమిషన్, సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారికి ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈసీ ఆదేశాలతో కలెక్టర్ మను చౌదరి ఆ ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు చేపట్టారు. సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులను సీసీ టీవీ ఆధారంగా గుర్తించారు. మొత్తం 106 మంది ఉద్యోగులను సస్పెండ్ చేయగా.. వారిలో 38 మంది సెర్ప్ ఉద్యోగులు, 68 మంది ఉపాధి హామీ ఉద్యోగులు ఉన్నారు. వీరు ఈ నిర్ణయాన్ని హైకోర్టులో సవాల్ చేయగా తాజాగా ఊరట లభించింది.

వైసీపీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్టే

అమరావతి: వైసీపీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్టే అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్ ప్రభుత్వం శిలా ఫలకాల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె ప్రసంగించారు. రాష్ట్ర మంతా వైసీపీ మాఫియా రాజ్యమేలుతోందని ఆరోపించారు. ఎటు చూసినా మద్యం మాఫియా, మట్టి మాఫియా, ఇసుక మాఫియా చెలరేగిపోతున్నాయని ధ్వజమెత్తారు. వేదవతి ప్రాజెక్టును పూర్తి చేస్తానని జగన్ హామీ ఇచ్చారన్నారు. ఐదేళ్లలో ప్రాజెక్టుకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మండిపడ్డారు. 2008లో వైఎస్ఆర్ శిలాఫలకం వేస్తే.. అదే ప్రాజెక్టుకు జగన్ మరో శిలాఫలకం వేశారు తప్పా.. ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. అందుకే జగన్ ప్రభుత్వం శిలా ఫలకాల ప్రభుత్వమని అన్నారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి చేస్తే 80 వేల ఎకరాలకు సాగునీరు అందేదని తెలిపారు. రైతుల కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కడతామని చెప్పి జగన్ మాట తప్పారని అన్నారు. ధరల స్థిరీకరణ నిధి పేరు చెప్పి రైతులను మోసం చేశారని ఆరోపించారు. రైతును వైఎస్ఆర్ రాజును చేస్తే.. వైసీపీ హయాంలో రైతులు అప్పుల పాలయ్యారని మండిపడ్డారు. మూరు?లకు ఓటు వేయొద్దన్న ఆమె వైసీపీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్టేనన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు షర్మిల. వైఎస్ షర్మిల ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఆలూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై తీవ్ర విమర్శలు చేశారు.జయరాంకు అభివృద్ధి మీద చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.

నన్ను గెలిపించండి..

హైదరాబాద్: నన్ను గెలిపించండి.. సికింద్రాబాద్ ఎంపీగా మీ నమ్మకాన్ని నిలబెడుతాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికలకు ప్రతిసారి పదవిలో ఉన్న ఐదేళ్ళు ఏం చేశానో ప్రజలకు నివేదిక ఇస్తున్నానని తెలిపారు. తెలంగాణ, సికింద్రాబాద్ అభివృద్ధి కోసం చేసిన పనులను ప్రజలు తెలియజేశానని అన్నారు. కేంద్ర మంత్రిగా నాకు మూడు శాఖలను అప్పజెప్పారు మోడీ అన్నారు. కేంద్ర మంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా పని చేస్తున్నానని తెలిపారు. 2004 నుంచి నాకు ఓటేసిన వారు తలదించుకునేలా చేయలేదన్నారు. నైతిక విలువలతో పని చేశానని అన్నారు. నన్ను గెలిపించండి.. సికింద్రాబాద్ ఎంపీగా మీ నమ్మకాన్ని నిలబెడుతాను అన్నారు.నేను ఎవరి మీద దౌర్జన్యాలు చేయలేదన్నారు. భూదందాలు చేయలేదు.. కాంట్రాక్టర్లను బెదిరించలేదన్నారు. ఎవరి పైన వివక్ష చూపించలేదు.. కక్ష కట్టలేదన్నారు. పార్టీ ఆదేశానుసారం సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్నానని తెలిపారు. తనని ఆశీర్వదించాలని కోరుతున్నానని, నాల్గో సారి రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేస్తున్నానని తెలిపారు. తన శ్వాస, నా ఊపిరి పార్టీనే.. పార్టీ లేకపోతే నేను లేనని అన్నారు. అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించాం.. ప్రచారాన్ని స్టార్ట్ చేశామన్నారు. ప్రజల ఆదరణలో కూడా ముందున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీల కంటే అత్యధిక సీట్లు గెలుస్తున్నామని తెలిపారు.బీఆర్ఎస్ కు డిపాజిట్లు కూడా రావని కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే మనకు ప్రధాన పోటీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. రాహుల్ గాంధీ గ్యారంటీలు ఇవ్వకుండా ఓట్లు ఎలా అడుగుతావు.? అని ప్రశ్నించారు. హామీల పేరుతో కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిందన్నారు. బీఆర్ఎస్ కు ఒక సీటు వచ్చినా.. రాకున్నా చేసేదేం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కు మేమే పోటీ, మేమే ప్రత్యామ్నాయమన్నారు.

జాతీయ రహదారి 65పై ఇంజనీరింగ్ లోపాలను సవరించాలి

జంక్షన్, గ్రామాల వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే

సూర్యాపేట,ఏప్రిల్ 19,మనసాక్షి:

రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పి రాహుల్ హెగ్డే జాతీయ రహదారుల భద్రత సంస్థ, జీఎంర్ సంస్థ, ఎన్ ఎచ్.65 కలిగిన సర్కిల్ ఇన్స్పెక్టర్స్, ఎస్ ఐ లతో రోడ్డు భద్రత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 80 కిలోమీటర్లు మేర జాతీయ రహదారి విస్తరించి ఉన్నది, ఈ మార్గం గుండా వాణిజ్య రవాణా పరంగా, ఇతర రాష్ట్రాలు కలుపుతూ, పండుగల సమయంలో హైదరాబాద్-విజయవాడ ప్రయాణాలు, దురాజుపల్లి జాతర, గ్రామాల్లో వ్యవసాయ పనులు ఇలా నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగి చాలా మంది మృత్యువాత పడుతున్నారు అని ఎస్పి తెలిపారు.. ఈ మార్గంలో లోపాలను గుర్తించడం జరిగినదని అన్నారు. ఇంజనీరింగ్ లోపాలు ఉన్నాయి, ఎక్కడపడితే అక్కడ రోడ్డు మధ్యలో మార్గాలు తెరిచారు, గ్రామాల నుండి వచ్చే లింక్ రోడ్లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి, సర్వీస్ రోడ్లు పూర్తి అవ్వలేదు, గ్రామాల వద్ద సూచిక బోర్డ్స్ పై అవగహన లోపం ఉన్నది, చాలా జంక్షన్ ల వద్ద ఫ్లై ఓవర్స్ అవసరం ఉన్నదనీ చెప్పారు.పాసెజ్ లు హైట్ కూడా తక్కువ ఉండడం వల్ల పెద్ద వాహనాలు వెళ్ళడం లేదు, ఎన్ ఎచ్ కు ఎక్కే వద్ద గ్రామీణ రోడ్లు సైరైన లెవల్ లో లేవు అని అన్నారు.అవసరమైన చోట సైన్ బోర్డ్ ఏర్పాటు తక్కువగా ఉన్నాయని , సెంట్రల్ లైటింగ్ కూడా తక్కువగా ఉన్నది ఇలాంటి లోపాలు ఉన్నాయి అని వీటిని ఎన్ ఎచ్ ఏ ఐ, జీఎంర్ అధికారులు సమన్వయంతో పని చేసి లోపాలను త్వరగా సవరించడానికి కృషి చేయాలని కోరారు.రోడ్డు ప్రమాదాల నివారణలో అందరం సమన్వయంతో పని చేసి లోపాలను సవరించి రోడ్డు నియమ నిభ%శీ%దనలపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలనీ అన్నారు.. సరికొత్త ప్రణాళికతో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనీ,మరణాలు సంభవించకుండా చూడడం ప్రాథమిక బాధ్యత, విధి అని ఆదేశించారు. ప్రజలు, వాహనదారులు పాసేజ్ లను, అండర్ పాస్ లను సక్రమంగా వినియోగించుకోవాలనీ , ఎక్కడపడితే అక్కడ వాహనాలు రోడ్లు దాటించటం,రాంగ్ రూట్ లో వాహనాలు నడపడం చేయకూడదని చెప్పారు.ఎన్ ఎచ్ ఏ ఐ , జీఎంర్ అధికారులు మాట్లాడుతూ ఎన్ ఎచ్ 65 పై ఇప్పటికే చాలా జంక్షన్, బ్లాక్ స్పాట్స్ వద్ద ఇంజనీరింగ్ లోపాలను సవరిస్తున్నామని,, పాసెజ్ లు, సర్వీస్ రోడ్లు, ఫ్లై ఓవర్ ల నిర్మాణం కోసం చర్యలు తీసుకున్నాము అని అన్నారు. త్వరలో అన్ని లోపాలను సవరిస్తాము, సెంట్రల్ లైటింగ్ పెంచుతాయి అని తెలిపారు..ఈ సమావేశంలో అదనపు ఎస్పి నాగేశ్వరరావు, ట్రైనీ ఐపిఎస్ రాజేష్ మీనా, ఎన్ ఎచ్ 65 టెక్నికల్ మేనేజర్ రాదేశ్యాం పైని, ఎన్ ఎచ్ ఏ ఐ జనరల మేనేజర్ శ్రీకాంత్, జీఎంర్ అధికారులు మాల్యాద్రి నాయుడు, నాగకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీరరాఘవులు, డీసీఆర్ బి ఇన్స్పెక్టర్ జితేందర్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు రాజశేఖర్, రామకృష్ణా రెడ్డి, రజిత రెడ్డి, రాము, చివ్వేంల, మునగాల, కోదాడ రూరల్ ఎస్ ఐ లు, ట్రాఫిక్ ఎస్ ఐ లు, జిల్లా రోడ్డు సేఫ్టీ బ్యూరో ఎస్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరగబడ్డ పులిబిడ్డ " సామాజిక గీతాన్ని ఆవిష్కరణ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

చింతపల్లి,ఏప్రిల్ 19,మన సాక్షి:

రాష్ట్రంలోని కళాకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.గురువారం హైదరాబాదులోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన పి ఆర్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చెల్లం పాండురంగారావు నేతృత్వంలో " తిరగబడ్డ" పులిబిడ్డ అనే సామాజిక గీతా పాటల సీడిని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండవర్గాలకు బహుజన రాజ్యం కోసం భారత రాజ్యాంగాన్ని నిర్మించి అందరికీ స్వేచ్ఛ సమానత్వాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ పై ఇలాంటి పాటలు చిత్రీకరించడం గాయకుడు చెల్లం పాండురంగారావు మహనీయుని పాటలు ప్రజల ముందుకు తీసుకురావడం అభినందనియమన్నారు. వెలివాడలో పుట్టిన అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి గా వెలుగుంది అణగారిన జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని వారు పేర్కొన్నారు. పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగారావు ప్రజానాట్యమండలి కళారూపాలతో ముందుకు వెళ్లడంతో పాటు ప్రజలను చైతన్య పరుస్తూ, సమాజ మార్పు కోసం మరెన్నో చైతన్య కొంతమైన పాటలను ముందుకు తీసుకువచ్చి మార్పు కోసం తనవంతుగా కృషి చేయడం అభినందన నీయమన్నారు. అదేవిధంగా సామాజిక సేవ దృక్పథంతో నిరుపేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం హర్షించదగ్గ విషయం అన్నారు. భవిష్యత్తులో మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని అందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వారి పేర్కొన్నారు. ఈ సిడి ఆవిష్కరణ కార్యక్రమంలో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ తెలంగాణ ప్రజానాట్య మండలి నల్లగొండ జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు, సి డబ్ల్యూ సి మెంబర్ మీద భాస్కర్, గుండాల అజయ్ కుమార్, కొట్టం శ్రీనివాస్, చెల్లం చింటూ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

జిల్లా కలెక్టర్ వెంకట్రావు

అర్వపల్లి,ఏప్రిల్ 19,మన సాక్షి:

ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలో నీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ధాన్యాన్ని రైతులు ఆరబెట్టిన తర్వాతనే కేంద్రాన్ని తీసుకొస్తే వెంటనే కాంటాలు జరుగుతాయని అన్నారు. 17% తేమ ఉన్న ధాన్యాన్ని తెచ్చిన రైతులను సీరియల్ ప్రకారం కాంటాలు నిర్వహించాలని తెలిపారు, రైతులు సరి అయిన పత్రాలు నిర్వాహకులకు అందజేస్తే 48 గంటలలో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. నిర్వాహకులు ట్యాబ్లో వెంటనే ఎంటర్ చేయాలని అన్నారు , నిర్వాహకుల అభ్యర్థన మేరకు రోజు నాలుగు లారీలను పంపించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్పోర్ట్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జె శ్రీనివాసులు , వ్యవసాయ శాఖ అధికారి, శశిధర్ రెడ్డి, ఎంపీడీవో సందీప్, ఏపిఎం, వలిశెట్టి మల్లేష్, ఏఈఓ శోభ రాణి, నిర్వాహకులు కృష్ణకుమారి, బి శ్రీకాంత్, సంధ్య, వీరమ్మ, రైతులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం

చింతపల్లి,ఏప్రిల్ 19,మన సాక్షి:

శ్రీరామనవమి పురస్కరించుకుని చింతపల్లి మండల పరిధిలోని గొడ కొండ్ల గ్రామంలో గత నాలుగు రోజుల నుండి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం హనుమాన్ దేవాలయంలో శ్రీవేణుగోపాల స్వామి గుడి చైర్మన్ అంగరేఖ గోపాల్ లక్ష్మీ దంపతులు ఉత్సవాలు ముగింపు సందర్భంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేపట్టారు. ఈ సంద ఈ సందర్భంగా శ్రీరామనవమి రోజు శ్రీ సీతారామచంద్ర మూర్తుల కన్నుల పండుగగా నిర్వహించారు. అదేవిధంగా స్వామివారి రథోత్సవాన్ని యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కనులు పండుగ భక్తిశ్రద్ధలతో లాగారు. శుక్రవారం బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా ఉత్సవ విగ్రహ మూర్తులను పలు వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతినిత్యం బ్రహ్మోత్సవాల సందర్భంగా విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ సభ్యులు ఇరుకుల్ల రాము, భరత్, సందుపట్ల రాంసాగర్ మాదారం శ్రీరాములు,, సెల్వరాజ్ లు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంగిరేకుల గోపాల్, ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు చింతపల్లి జెడ్పిటిసి కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి మాజీ జెడ్పిటిసి మాస మంజుల భాస్కర్, శ్రీ పగడాల కనకయ్య ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు, ఆలయ పూజారి ప్రవీణ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు,హనుమాన్ యూత్ కమిటీ సభ్యులు, సిద్ధి వినాయక యూత్ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ అంగరేకుల గోవర్ధన్, మద్దెల కృష్ణ గౌడ్ సందు పట్ల లక్ష్మణ్ సాగర్, గొట్టే పర్వతాలు, పోలేపల్లి నరేష్, సీతారాములు, ముడిగ మల్లేష్ యాదవ్, పాలకూరల కృష్ణ, పల్లపు శ్రీను, గోవింద్ రాజు, పుప్పాల వెంకటేశ్వర్లు, అంగిరేకుల రాజు, చేపూరి శ్రీనివాస్, మల్లోజు జగన్,శివ జిట్ట జగదీష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాలలో 25, 26న అశ్వ ఫెస్ట్

సినీ హీరో నిఖిల్ రాక

మదనపల్లి,ఏప్రిల్ 19, మన సాక్షి :

మదనపల్లి దగ్గర అంగళ్ళు లోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ %డ% సైన్స్ (మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల)లో ఈ నెల 25, 26 వ తేదీలలో జాతీయ స్థాయిలో టెక్నో - కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ ఆశ్వ్ 2కే 24 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కళాశాలలో ఫ్లాష్ మాబ్ ను నిర్వహించారు. కళాశాల విద్యార్థులు వివిధ పాటలకు డాన్స్ చేసి విద్యార్థులు చూపరులను అలరించారు. ఈ నెల 25 మరియు 26 వ తేదీలలో జరుగు ఈ అశ్వ్ కార్యక్రమానికి సినీతారలు, సింగర్లు వస్తున్నట్లు ఆయన అన్నారు. 25 వ తేదీన కార్తికేయ సినీమా హీరో నిఖిల్ మరియు ప్రముఖ మిమిక్రి ఆర్టిస్ట్ ఆర్ జె సూర్య, 26న ప్రముఖ గాయకులు అర్జున్ విజయ్, సిందూజా శ్రీనివాసన్ మరియు ఎం. పర్ణిక లు రాబోతున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను అలరించడానికి ఈ కార్యక్రమములను కళాశాల ప్రాంగణం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ కార్యక్రమం లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు వేగవంతం చేయాలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం

సూర్యాపేట,ఏప్రిల్ 19,మనసాక్షి:

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం సూచించారు. భద్రాచలం పర్యటన తిరుగు ప్రయాణంలో భాగంగా గురువారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తో కలసి అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బుర్ర వెంకటేశం మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలు నేపద్యంలో ఎన్నికల కమిషన్ విద్యాశాఖ ద్వారా జరిగే అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు మినహాయింపు ఇచ్చిందని జిల్లాలో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన 536 పాఠశాలలో 59 పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయని మిగిలిన 337 పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని వివరించారు.

వినియోగదారులకు అత్యుత్తమ సేవలందించాలి

జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట,ఏప్రిల్ 19,మనసాక్షి:

వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జిల్లా కేంద్రంలోని జనగం ఎక్స్ రోడ్డు సమీపంలో గల శ్రీ సాయి గ్లోబల్ మల్టీ బ్రాండ్ సర్వీస్, వీల్ కేర్ కార్ సెంటర్ ను ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా దినదినాభివృద్ధి చెందుతుందని, అన్ని రకాల కార్ సెంటర్లకు సర్వీసు ఉపయోగపడుతుందని ఇలాంటి కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమని తెలిపారు. యువతకు ఇలాంటి సెంటర్లు పెట్టడం వల్ల ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. జిల్లాలో ఇంత పెద్ద సర్వీస్ సెంటర్ జిల్లా ప్రజల కే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కార్లకు కూడా సర్వీస్ సెంటర్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి సురేష్ రెడ్డి, డిఎస్పీ జి.రవి, సిఐ రాజశేఖర్, ఉన్నం సత్యనారాయణ, శంకర్ చౌదరి, బాలాజీ నాయక్, గుడిపూడి వెంకటరమణ, యజమాని శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీని అంతం చేయడం ఎవరి తరం కాదు

మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

అర్వపల్లి,ఏప్రిల్ 19,మన సాక్షి:

తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్రాన్ని సాధించిన బిఆర్ఎస్ పార్టీని అంతం చేయడం ఏ పార్టీ తరం గాదని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యాము మల్లేశంతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారీ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర%శీ% లో కరువు తాండవిస్తుందని ఏ క్కడ చూసిన సాగు త్రాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్లకు వాళ్లే గ్రూప్ తగదాలు పెట్టుకొని వాళ్ళ ప్రభుత్వాన్ని వాళ్లే కూల్చుకుంటారని ఎద్దేవ చేశారు.పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే కేసీఆర్ నాయకత్వంలో ప్రజలు ఎక్కడికక్కడ తిరగబడతారని అన్నారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ నుండి నాయకులు పోయినంత మాత్రాన కార్యకర్తలకు కొదవలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి మల్లేశం, మాజి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ , బూడిద బిక్షమయ్య గౌడ్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా పరిషత్ చైర్మన్లు గుజ్జ దీపిక యుగంధర్ రావు, ఎలిమినేటి సందీప్ రెడ్డి, జెడ్పిటిసి, దావుల వీరప్రసాద్, నాగారం ఎంపీపీ కూర మని వెంకన్న, అర్వపల్లి టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గుండెగాని సోమేష్ గౌడ్, పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బీఫారంకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భారీ ర్యాలీ మండల కేంద్రంలో నిర్వహించారు అన్ని మండలాల అధ్యక్షులు మాజీ సర్పంచులు గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు భగభగలాడే ఎండలు సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొనడంతో నాయకులు సంతోషం వెలిబుచ్చారు.

బెల్ట్ షాపులపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

-22.475 లీటర్ల బీర్లు విస్కీ బాటిల్స్ స్వాధీనం

గజ్వేల్,ఏప్రిల్,19,మనసాక్షి

ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా కొడకండ్ల గ్రామంలో కొండ శ్రీనివాస్ తండ్రి వెంకట నరసయ్య,తన కిరాణా షాప్ లో అక్రమంగా నడుపుచున్న బెల్ట్ షాపులపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్,కుకునూరు పల్లి పోలీసులు కలసి రైడ్ చేసి 22.475 లీటర్ల బీర్లు విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.కుకునూరు పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఇండ్లలో, హోటల్లలో,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో,కిరాణా షాపులలో, ఇతర దుకాణాలలో ఎలాంటి ప్రభుత్వ పర్మిషన్ లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నడిపితే,మరియు బహిరంగ ప్రదేశంలో కానీ ఇళ్లల్లో గానీ పేకాట ఆడితే సమాచారం అందించాలని కోరారు.జూదం పేకాట ఆడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక,పిడిఎస్ రైస్,అక్రమ రవాణా చేసిన మరియు పేకాట,జూదం,గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన కలిగి ఉన్న చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

బార్డర్ చెక్ పోస్టును తనిఖీ చేసిన గజ్వేల్ ఎసిపి

లోక్ సభ ఎన్నికల దృష్ట్యా ముమ్మరంగా తనిఖీలుప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలిచెక్పోస్ట్ విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలి

గజ్వేల్,ఏప్రిల్,19,మనసాక్షి

గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లాలో చెక్పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్రమంగా ఎవరైనా ఎలాంటి ఆధారాలు లేని నగదు కానీ మద్యం మరియు ఓటర్లను ప్రలోభాలకు కురిచేసే వస్తువులను,మరియు మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.చెక్ పోస్ట్ లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని 24%ఽ%7 విధులు నిర్వహించాలని సూచించారు.ప్రతి వాహనాన్ని క్షున్యంగా తనిఖీ చేయాలని, తనిఖీలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వచ్చిపోయే వాహనాలను పరిశీలిస్తూ తనిఖీలు చేయాలని తెలిపారు.రాత్రి సమయాల్లో తనిఖీ చేసేటప్పుడు టార్చ్ లైట్ తప్పక ఉపయోగించాలని తెలిపారు.

తుమ్మల పై దాడి కుట్రదారులను వెంటనే అరెస్ట్ చేయాలి.

నేలకొండపల్లి, ఏప్రిల్ 19 మన సాక్షి:

రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాడి చేసేందుకు చేసిన కుట్రదారులను వెంటనే అరెస్ట్ చేయాలని పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.... మంత్రి తుమ్మల పై దాడి చేయాలని కుట్ర పన్నిన వాళ్లెవరో త్వరగా విచారించి ఆ కుట్రదారులు ఎంత పెద్ద స్థాయిలో ఉన్న వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.
తుమ్మల రాజకీయ జీవితం లో ఒకరికి హాని చేయటం తెలియని వ్యక్తి పై దాడి చేసేందుకు పథకం పన్నటం చాలా దుర్మార్గం అన్నారు. నేలకొండపల్లి మండలం లోని మామిడితోట బాగోతం బయటపెట్టాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ లో పాత్రధారులు. సూత్రధారులు అందరిని – కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతం చేసామని హెచ్చరించారు.

కంగ్టి లో పేదింటి ఆడబిడ్డకు ఆర్థిక సాయం..!

పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,

కంగ్టి, ఏప్రిల్ 19, మన సాక్షి :-

పేదింటి పెళ్లి కూతురికి విగ్రహం రామా గౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ విగ్రహం శ్రీనివాస్ గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రానికి చెందిన దర్జీ మహేశ్వరి తండ్రి దర్జీ సంతోష్ మృతి చెందారు. మహేశ్వరి పెళ్లికి స్థానికులు చంద్రకాంత్ గౌడ్, ట్రస్ట్ చైర్మన్ కు తెలుపగా వెంటనే స్పందించి రూ.5 వేలు ఆన్లైన్లో వేయగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పెళ్లి బాధ్యతలు చేపడుతున్న తల్లి దర్జీ సుజాత, తండ్రి కోల్పోయిన అమ్మాయిని ఆర్థిక సాయం అందించిన పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ను ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, గణేష్ గౌడ్, బైరి అశోక్ ఉన్నారు.

ప్యాకేజీ స్టార్ మాటలు నమ్మకండి

వారికి ఓటేస్తే పథకాలన్నీ గల్లంతే
దోచుకోవడానికి కూటమిగా వస్తున్న నేతలు
రాష్ట్ర భవిష్యత్ కోసం వైసిపినే గెలిపించాలి
ఫ్యాన్‌కు ఓటేస్తేనే పెన్షన్లు వస్తాయి
పెళ్లిళ్లతో వ్యవస్థను అవమానించిన పవన్
బాబు కూటమితో జాగ్రత్త సుమా అన్న జగన్
కాకినాడ మేం సిద్ధం సభలో బాబుపై వ్యంగ్యాస్త్రాలు

కాకినాడ: ఇంటింటికి ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని , పొరపాటున చంద్రబాబు కూటమికి ఓటేస్తే పథకాలన్నీ రద్దు అవుతాయని ఏపీ సీఎం వైఎస్ జగన్ ప్రజలను హెచ్చరించారు. చంద్రబాబు సాధ్యం కాని హామీలిస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రాన్ని దోచుకునేందుకు కూటమిగా ఏర్పడ్డారని ఆరోపించారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా కాకినాడ జిల్లాలో జరుగుతున్న మేమంతా సిద్ధం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాకినాడ అచ్చంపేట జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. కాకినాడలో ఉప్పొంగి ప్రవహిస్తన్న నిండు గోదావరి కనిపిస్తోందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం వైసీపీని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీకీ ఓటేస్తే రాష్ట్రంలో అమలవుతున్న పథకాలన్నీ కొనసాగుతాయని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పొరపాటున చంద్రబాబుకు ఓటేస్తే పథకాలన్నీ రద్దవుతాయని అన్నారు. ఫ్యాన్‌కు ఓటేస్తే.. అవ్వతాతలకు రూ.3వేల పెన్షన్ వస్తుందని తెలిపారు. బాబుకు ఓటేస్తే జన్మభూమి కమిటీలతో దోచుకుంటారని విమర్శించారు. ఫ్యాన్‌కు ఓటేస్తే ఇంటింటికి పౌర సేవలు అందుతాయని పేర్కొన్నారు. బాబుకు ఓటేస్తే.. పశుపతి నిద్రలేచి వదలా బొమ్మాళి అంటాడని సీఎం జగన్ మండిపడ్డారు. 2014లో కూటమి తరఫున పోటీ చేసి ఇచ్చిన రుణమాఫీ, పొదుపు సంఘాల రుణమాఫీ, అర్హులైన వారికి మూడుసెంట్ల స్థలం ఇవ్వలేదని, సింగపూర్‌కు మించి నగరాలను నిర్మించలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు వద్ద ప్యాకేజీలు తీసుకున్నారని దుయ్యబట్టారు. పెళ్లిళ్ల పేరిట వివాహవ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారని అన్నారు. జ్వరం వచ్చినా హైదరాబాద్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటూ పిఠాపురాన్ని అవమాన పరుస్తున్నాడని పేర్కొన్నారు. బాబు ప్రయోజనం కోసం సొంత పార్టీ అభ్యర్థులను సైతం

మార్చివేస్తు న్నాడని ఆరోపించారు. ఎన్నికలకు కేవలం 25 రోజులే ఉన్నాయని.. జైత్రయాత్రకు సిద్ధమని ప్రజలంతా సింహగర్జన చేస్తున్నారని తెలిపారు. మంచి చేసిన మీ బిడ్డకు తోడుగా ఉండేందుకు మీరంతా సిద్ధమా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో పేదల వ్యతిరేక వర్గాన్ని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. పెత్తందారుల అనుకూల వర్గానికి, పేదల అనుకూల వర్గానికి క్లాస్ వార్ జరుగుతోందన్నారు సీఎం జగన్. మీరేసే ఓటు.. రాబోయే ఐదేళ్ల భవిష్యత్తని అన్నారు. జగన్‌కు ఓటేస్తే పథకాలన్నీ కొనసాగుతాయని తెలిపారు. ఇప్పటి వరకు రూ. 2 లక్షల 70 వేల కోట్లు పేదల ఖాతాల్లో వేశామని పేర్కొన్నారు. దోచుకోవడం, దాచుకోవడం బాబు మార్క్ పాలన అని మండిపడ్డారు. రెండు ఓట్లు ఫ్యాన్ మీద వేస్తే జగన్ మార్క్ పాలన కొనసాగుతోందన్నారు.జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ఏపీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సెటైర్లు వేశారు. చంద్రబాబు సిట్ అంటే.. సిట్.. స్టాండ్ అంటే స్టాండ్ అన్నట్లుగా దత్తపుత్రుడి పరిస్థితి ఉంటుందని విమర్శించారు. కాకినాడలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మేమంతా సభలో పాల్గొన్న వైఎస్ జగన్.. బాబు ఏం చెప్పినా జీహుజూర్ అంటూ ప్యాకేజిస్టార్ ఉంటాడని ఎద్దేవా చేశారు. టీడీపీతో జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకోవడంపైనా జగన్ విమర్శలు గుప్పించారు. ఇది వ్యక్తిత్వం ఉన్న పార్టీలు కలిస్తే ఏర్పడిన కూటమి కాదని.. మిగతా పార్టీల్లోకి చంద్రబాబు తన మనుషులను పంపితే ఏర్పడిన కూటమి విమర్శించారు. దత్తపుత్రుడు టికెట్లు ఇస్తే ఏర్పడిన కూటమి కాదు.. దత్తపుత్రుడికి ఎన్ని టికెట్లు ఇవ్వాలో.. ఆ టికెట్లలో ఎవరు పోటీ చేయాలో.. చివరకు ఆ ప్యాకేజి స్టార్ కూడా ఎక్కడ పోటీ చేయాలో కూడా చంద్రబాబు నిర్ణయిస్తేనే ఏర్పడిన పొత్తు అని అన్నారు. ఆ ప్యాకేజిస్టార్‌ను భీమవరం అంటే భీమవరం.. గాజువాక అంటే గాజువాక.. పిఠాపురం అంటే పిఠాపురం.. ఇలా బాబు తన ప్రయోజనం కోసం ఎక్కడ నిలబడాలంటే అక్కడ నిలబడతాడని విమర్శించారు. చంద్రబాబు సిట్ అంటే సిట్.. స్టాండ్ అంటే స్టాండ్, జగన్‌ను తిట్టు అంటే తిట్టు.. కొట్టు అంటే కొట్టు.. అన్నట్లు ప్యాకేజి స్టార్ పరిస్థితి ఉందని జగన్ విమర్శించారు. దత్తపుత్రుడా నీకు ఇచ్చేది 80 కాదు 20 సీట్లే అంటే దానికి కూడా జీ హుజూర్ అని ప్యాకేజి స్టార్ అన్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని హోల్‌సేల్‌గా దోచుకునేందుకు.. దోచుకునేది పంచుకునేందుకు చంద్రబాబు రాజకీయాలు చేస్తుంటే.. కులాన్ని హోల్‌సేల్‌గా బాబుకు అమ్మేయగలననే భ్రమతో ప్యాకేజి స్టార్ రాజకీయం చేస్తున్నారని జగన్ విమర్శించారు. ఈ ప్యాకేజి స్టార్‌కు మన రాష్ట్రం అంటే ఎంతో చులకన అని అన్నారు. జ్వరం వస్తే పిఠాపురం వదిలి హైదరాబాద్ వెళ్లిపోయే అంత చులకన అని విమర్శించారు. ఇంతకుముందు ప్యాకేజిస్టార్‌కు పాలకొల్లు, భీమవరం, గాజువాక మూడు అయ్యాయి.. ఇప్పుడు పిఠాపురం నాలుగోది అని.. ఏ ప్రాంతమైనా ప్రేమ ఉండదని అన్నారు. ఈ మ్యారేజి స్టార్‌కు ఏ భార్య అయినా ప్రేమ ఉండదని పేర్కొన్నారు.
పెళ్లిళ్లే కాదు.. ఇప్పుడు నియోజకవర్గాలు కూడా నాలుగు అయ్యాయని అన్నారు. ఏ ప్రాంతంపైనా ప్యాకేజి స్టార్‌కు ప్రేమ ఉండదని అన్నారు. '

నవవధువు కు పుస్తే మట్టెలు అందజేసిన ఎంపీపీ పాండు గౌడ్

గజ్వేల్,మర్కుక్,ఏప్రిల్,19,మనసాక్షి

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన దుబ్బాసి యాదవ్వ,మల్లయ్య కూతురు మహేశ్వరి వివాహానికి పుస్తే మట్టెలు అందజేసిన ఎంపీపీ పాండు గౌడ్,ఈ సందర్భంగా పెళ్ళి కూతురు కుటుంబ సభ్యులు ఎంపీపీ పాండు గౌడ్ కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే గ్రామంలో పేదింటి ఆడబిడ్డలకు,నిరుపేదలకు అండగా నిలుస్తున్న ఎంపీపీ పాండు గౌడ్ ను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో కర్రోల్ల నర్సింలు,దుబ్బాసి బాలయ్య,మల్లయ్య ,బాలకృష్ణ,బిక్షపతి, స్వామి,నర్సింలు, నర్సయ్య,బాబు,చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ తో బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే భేటీ

రాజేంద్రనగర్ , ఏప్రిల్ 19, మనసాక్షి :



రాష్ట్రంలో బీఆర్ఎస్ కు మరో బిగ్ షాక్ తగలనున్నది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని చెప్పినప్పటికీ ఆయన తన ఎమ్మెల్యేలను కాపాడుకోలేకపోతున్నారనేది వాస్తవం. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో భేటీ అయ్యారు. ఇది ఆ నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారింది. వివరాల ప్రకారం.. కాంగ్రెస్ లో చేరేందుకు రాజేంద్ర నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సిద్ధమయ్యారని సమాచారం. శుక్రవారం జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి తో ఆయన నివాసంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ భేటీ అయ్యారు. రెండు రోజులలో అనుచరులతో చర్చించి కాంగ్రెస్ లో చేరుతానని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ ఇచ్చినట్లు సమాచారం. శనివారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని అనుచరుల నుంచి ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్ లో చేరనున్నట్లు తెలుస్తోంది.

హత్య కేసులో నేరస్తునికి యావజ్జీవ కారాగార శిక్ష జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 18 , మన సాక్షి :

శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ నేరస్తుడైన మొండి బాలరాజు పైన నేరము నిరూపణ అయినందున యావజ్జీవ కారాగార శిక్షతో పాటు 20,000/- రూ. జరిమానా విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది.
కేసు యొక్క వివరాలు:తేదీ:15 జూన్ 2022న మృతుని భార్య అయిన మొండి కాశమ్మ, పెదకడుమూరు గ్రామం నర్వ మండలం. ప్రస్తుతము హైదరాబాద్ మహాత్మా గాంధీ నగర్ షేక్పేట్లో తన భర్త అయిన మొండి శ్రీను హైదరాబాదులో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తన భర్తకు మరియు నేరస్తుడైన మొండి బాలరాజ్ పెద్దకొడమూరు గ్రామంలో వ్యవసాయ పొలం ఉన్నది. ఇద్దరి మధ్యలో భూమి కోలవగా నా భర్తకు భూమి ఎక్కువగా వచ్చిందని తేదీ:11 జూన్ 2022న నేరస్థుడు ఫోన్ చేసి భూమి విషయం మాట్లాడుదాము అని నాతో చెప్పి పెదకడుమూరు గ్రామానికి రమ్మన్నాడని గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడదాం అని చెప్పగా తేదీ:14 జూన్ 2022న రాత్రి 9 గంటల 45 నిమిషాలకు మృతుడు తన చెల్లెలు అయిన అనిత ఇంటి ముందు మంచంపై కూర్చుని అన్నం తింటుండగా నేరస్థుడు రోకలి బండ తీసుకొని వెనుక నుంచి వచ్చి తల పైన రెండుసార్లు కొట్టగా మొండి శ్రీను చనిపోయినాడు అని మృతుని చెల్లెలు నాకు ఫోన్ చేసి తెలూపగా మృతుని భార్య నర్వ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై ఎం. విక్రమ్ కేసు నమోదు చేసినారు. ఇట్టి కేసుని అప్పటి మరికల్ సిఐ రామ్ లాల్ కేసును పరిశోధించి నేరస్తునికి వ్యతిరేకంగా 18 మంది సాక్షులను విచారించి నేరస్తుని పై కోర్టులోచార్జిషీటు వేయగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ఆకుల బాలప్ప 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి వాదనలు వినిపించగా ప్రస్తుత మరికల్ సిఐ రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం నర్వ ఎస్ఐ కుర్మయ్య మరియు కోర్టు డూటీ ఆఫీసర్ వేణుగోపాల్ సాక్షులకు సమన్సు అందచేయగా కోర్టులైజన్ ఆఫీసర్ బాలకృష్ణ, కోర్టుపిసి విజయ్ కుమార్ సహకరంతో సాక్షులను కోర్టులో హాజరు పరచగా నేరస్తునిపై నేరం రుజువు అయి శుక్రవారం శిక్ష ఖరారు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ... నేరస్తునికి శిక్ష పడటంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప, అప్పటి సిఐ రామ్ లాల్, ప్రస్తుత సిఐ రాజేందర్ రెడ్డి, అప్పటి ఎస్సై విక్రం, ప్రస్తుత ఎస్సై కురుమయ్య, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు వేణుగోపాల్, విజయ్ కుమార్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ బాలకృష్ణ లను ఎస్పీ అభినందించి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన భాస్కర్

గజ్వేల్,ఏప్రిల్,19,మనసాక్షి

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ భాద్యులు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో దాదాపు 200 మంది అనుచరులతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ కౌన్సిలర్లు,సుభాష్ చంద్రబోస్,రామచంద్ర చారి, కాంగ్రెస్ పార్టీ లో చేరారు. వారితో పాటు గజ్వేల్ నర్సింలు,నీరుడి ఇస్తరి, బిఆర్ఎస్ వార్డు అధ్యక్షులు ఎండీ ఇక్బాల్,సబ్బని నరేష్ రాజేశం తాజా మాజీ సర్పంచులు,ముట్రాజ్ పల్లి మాజీ ఎంపీటీసీ మల్లేశం, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు,గాడిపల్లి శ్రీనివాస్, బి సి సంఘం నాయకులు గుంటకు బిక్షపతి,యాదవ సంఘం రాష్ట్ర నాయకులు కన్నా యాదవ్,రిమ్మన గూడ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు అజిజ్ , రాజమల్లయ్య గౌడ్,రజక సంఘం నేతలు రాములు, రాజయ్య,బేజుగామ మాజీ ఎంపీటీసీ మరియు గజ్వేల్ ప్రజ్ఞపూర్ మున్సిపల్ నుండి పెద్ద ఎత్తున దాదాపు 200 వందల మంది ప్రత్యేకంగా గజ్వేల్ నుండి కాంగ్రెస్ పార్టీ లో చేరిక అలాగే ములుగు మండలం నుండి వివిధ నాయకులు భారీ సంఖ్యలో ఈరోజు కాంగ్రేస్ పార్టీ లో చేరారు.ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్,మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ గజ్వేల్ నుండి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీలోకి మరిన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం అని అన్నారు.మెదక్ ఎంపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలియజేశారు.

అగ్ని ప్రమాద బాధితులను పరామర్శ

చిరు సాయం అందించిన సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ. పార్టీ కార్యదర్శి కొండా కౌశిక్.

చర్ల,ఏప్రిల్19,మనసాక్షి:

చర్ల మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో గత నాలుగు రోజుల క్రితం సోమవారం రాత్రి 8 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఆ అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను సిపిఐ ఎంఎల్ మాస్లైన్ పార్టీ చర్ల మండల నాయకత్వం శుక్రవారం పరామర్శించి చిరు సహాయాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ చర్ల మండల కార్యదర్శి కొండ కౌశిక్ మాట్లాడుతూ లింగాపురం గ్రామంలోని మెడబతిని నరసింహారావు చందుల రెండూ గడ్డి గుడిసెలు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధం కావడం జరిగిందని ఆ రెండు కుటుంబాలు కూడా కట్టు బట్టలతో రోడ్డున పడ్డటువంటి పరిస్థితి ఉందని అన్నారు. సర్వం కోల్పోయిన ఆ బాదిత కుటుంబాలకి అండగా నిలిచి ఆదుకోవాలనే ఉద్దేశ్య%శీ%తో మా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ చర్ల మండల పార్టీ ఆధ్వర్యంలో రైస్ బ్యాగ్,ఆయిల్ డబ్బా, ఉప్పు పప్పుల నిత్యావసరాలనూ కట్టుకోవడానికి బట్టలను చిరు సహాయం కింద అందించడం జరిగిందని తెలిపారు.అధికారులు తక్షణమే చర్ల లో ఫైర్ స్టేషన్ ను ఏర్పాటు చేసి ఇలాంటి ప్రమాదాలను అరికట్టే దిశగా అడుగులు వెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు.లేదంటే పోరాటాలు తప్పవ్ అని హెచ్చరించారు. సహృదయం కలిగినటువంటి పెద్దలు ట్రస్ట్ సేవా సంస్థలు మనవతావాదులు కట్టు బట్టలతో రోడ్డున పడ్డటువంటి ఈ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు సిమ్మిడి సుజాత, మెహముద, రెడ్డి, శ్రీను లు పాల్గొన్నారు.

పల్లెలో తాగునీటి సమస్య తలెత్తుకుండా జాగ్రత్తలు తీసుకోండి

అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్.

నేలకొండపల్లి, ఏప్రిల్ 19 మన సాక్షి:

అమ్మ ఆదర్శ పాఠశాల లో పనులు ముగింపు నాటికి పూర్తి చేయాలని అడిషనల్ జిల్లా కలెక్టర్ (స్థానిక సంస్థల) సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం నేలకొండపల్లి మండల పరిషత్ అధికారులు, విద్యాశాఖ, పంచాయతీ, ఐకేపీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలం లోని పలు విషయాల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... అమ్మ ఆదర్శ పాఠశాలలో పాఠశాలల ముగింపు నాటికి పనులు శర వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పల్లెలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులలో అవసరమైతే మంచినీటి వనరులను అద్దెకు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర సాయిలో పర్యటించి సమస్యలను గురించాలని అన్నారు. ఈసమావేశంలో నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, మండల విద్యాశాఖాధికారి బీ.రాములు, ఐకేపీ ఏపీయం ఆశోక్రాణి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ నవక్రాంతి పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థిగా సిలివెరీ ఇంద్రాగౌడ్

గజ్వేల్,ఏప్రిల్,19,మనసాక్షి

హైదారబాద్ స్టేట్ ఆఫీస్ లో నేషనల్ నవక్రాంతి పార్టీ జాతీయ అధ్యక్షుడు కనకం శ్రీనివాస్ రావు చేతుల మీదుగా బీఫామ్ తీసుకున్న సిలివెరీ ఇంద్రాగౌడ్.ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను నమ్మి మెదక్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రజా వ్యతిరేకత ఓట్లతో విజయం సాధిస్తానని,ప్రజా సేవే లక్ష్యంగా,ప్రజల కొరకు ముందుకు వస్తున్నాను. మెదక్ ప్రజలందరూ కూడా ఆశీర్వదించగలరని సిలివెరీ ఇంద్రాగౌడ్ కోరారు.

వైభవంగా.. రథోత్సవం

పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు..

ఘనంగా బండ్ల ఊరేగింపు..

అందోలు, ఏప్రిల్, మనసాక్షి :

జోగిపేట జోగినాథ రాథోత్సవాలలో గురువారం రాత్రి రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది.రథోత్సవాన్ని చేసేందుకు వేలాది మంది భక్తులు తరలిరావడం తో .. జోగిపేట పట్టణం శివనామస్మరణతో మారుమోగింది. రంగు రంగుల విద్యుత్ దీపాలు, దేవతామూర్తుల విగ్రహాలతో అందంగా అలంకరించడంతో శ్రీజోగినాథ రథం విద్యుత్ కాంతులతో దగదగ మెరిసిపోతూ చూపరులను ఆకర్శిస్తూ రథం ముందుకు కదిలింది. రథోత్సవం ప్రారంభానికి ముందు గౌని చౌరస్తా వద్ద రథం ఎదుట భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రథం ముందు అన్నం రతిగా పోసారు. వడ్ల, కమ్మరి, చాకలి, మంగళి కులాలకు చెందిన వారు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రథానికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది రాత్రి 10 గంటల నుంచే వేలాది మంది భక్తులు రథయాత్రను తిలకించేందుకు తరలిరావడం విశేషం. జోగిపేట చుట్టు పక్క ప్రాంతాలకు చెందిన భక్తులు రథంను అనుసరించారు. గౌని చౌరస్తా నుంచి ప్రారంభమైన రథయాత్ర శ్రీ జోగినాథ దేవాలయం వద్దకు శనివారం తెల్లవారుజాము వరకు చేరుకుంది.

ఆకట్టుకున్న నంది కోలాహలం..

వనపర్తి జిల్లా నుండి తీసికువచ్చిన నంది కోలాహలం నృత్యం జోగినాథ రథయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డోలు వాయిద్యాలు,సన్నాయిల చెప్పుళ్లకు అనుగుణంగా వారు నృత్యాలు చేయడం చూపరులను ఆకట్టుకున్నారు. రథం ముందు నృత్య ప్రదర్శనలు చేస్తూ భక్తుల చేతిలో, తలపై కొబ్బరి కాయలను పెట్టి కట్టెతో పగలగొట్టారు. వాయిద్య గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జోగిపేట ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తూ నిర్వహించారు. శుక్రవారం రథోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రథోత్సవ కమిటీ అధ్యక్షుడు డాకూరి శంకర్, సభ్యులు పట్లూరి శివశేఖర్, రంగ సురేష్,చింతల సురేష్, డీబి నాగభూషణం, వెంకటేశం తదితరులు



ఉపాధి హామీ కూలీలకు అవగాహన

గజ్వేల్,ఏప్రిల్,19,మనసాక్షి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పని చేస్తున్న గజ్వేల్ మండలం పరిధిలోని అక్కారం గ్రామమును సందర్శించిన డిప్యూటీ డి.ఎమ్.ఎచ్ఒ.డా శ్రనివాస్ ఎమ్.ఓ.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శ్రీ గిరి పల్లీ బల్బీర్ సింగ్ ఏ.ఎన్.ఎమ్ శ్రీ దేవి, ఆశా కార్యకర్తలు నాగమణి, కవిత మరియు సబ్.యునిట్ ఆఫిసర్ శ్రీనివాస్ గజ్వేల్,డా.శ్రీనివాస్ డిప్యూటీ.డిఎమ్.ఎచ్ఒ. కూలీలకు ఓ.ఆర్.ఎస్ పాకెట్స్.పంపిణీని చేసారు.వారికి సరిపోయేంత పాకెట్స్ఇచ్చారు. హీట్ వేవ్,హీట్ స్ట్రోక్ గురించి అవగాహన కల్పించారు.వారితో పాటు పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ లలిత ఉన్నరు.

ఓటరు అవగాహన ర్యాలీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 19 మనసాక్షి :-

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కళా బృందం ఆలపించిన ఓటరు చైతన్య గీతాల మధ్య కొనసాగిన ఈ అవగాహన ర్యాలీ శాసన్ పల్లి రోడ్డు, మున్సిపల్ పార్క్ మీదుగా టీచర్స్ కాలనీ నాగుల కట్ట వరకు చేరుకుంది. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని ఉద్దేశించి ఆర్డీవో మధుసూదన్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్క ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సమర్ధులైన నాయకులను ఎన్నుకునేందుకు ఓటు వేయాలని కోరారు. స్వీప్ కార్యక్రమ నోడల్ అధికారి, జెడ్పీ ఇన్ చార్జి సీఈవో జ్యోతి మాట్లాడుతూ... ఓటు హక్కు వినియోగంలో యువత, ముఖ్యంగా మహిళలు ముందుండాలని సూచించారు. మహిళలు ఓటు వేయడమే కాకుండా రాజకీయాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలలో ఓటర్లు డబ్బు, మద్యం, ఇతర ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ సునీత, తహాసిల్దార్ రాణా ప్రతాప్, డీ.టీ. నారాయణ, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, మహిళా సంఘాల ఆర్పీలు, చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: ఏప్రిల్ 19: (మన సాక్షి)

వేసవిలో పట్టణ పరిధిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు నీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యల గురించి సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు నీటి కొరతతో ఇబ్బంది పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మేనేజర్ అంజని కుమార్, మున్సిపల్ AE, మిషన్ భగీరథ AE, వార్డు ఆఫీసర్లు, నీటి సరఫరా సిబ్బంది ఉన్నారు.

ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో పోలీసుల విస్తృత తనిఖీలు

మంగపేట ఏప్రిల్ 19, మన సాక్షి ప్రతినిధి

ఎలక్షన్ కోడ్ నేపథ్యం లో మంగపేట మండలంలోని బ్రాహ్మణపల్లి చెక్ పోస్ట్ దగ్గర ఏటూరునాగారం ఏఎస్పి మహేష్ బాబాసాహెబ్ విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఏఎస్పి మరియు మంగపేట ఎస్సై గోదారి రవికుమార్, తన సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించటం జరిగింది. బ్రాహ్మణపల్లి చెక్ పోస్ట్ జాతీయ రహదారిపై ప్రతి వాహనంను అపి క్షుణ్ణంగా సోదాలు నిర్వహిస్తూ వాహన దారుల యొక్క వివరాలు తెలుసుకోవటం జరిగింది. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం సరఫరా ను అడుకోవటనికి పగడ్బందిగా చర్యలు చేపట్టుతున్నామని ఈ సందర్భంగా ఏఎస్పి మహేష్ బాబాసాహెబ్, ఎస్సై రవికుమార్, చెప్పటం జరిగింది.

ఎన్నికల వ్యయ పరిశీలకునిగ వరుణ్ రంగస్వామి ఐ.ఆర్.ఎస్.

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 19 మనసాక్షి :-

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్ నగర్ పార్లమెంటరీ పరిధిలోని నారాయణపేట మక్తల్ నియోజకవర్గాల అభ్యర్థుల, ఎన్నికల ప్రచార ఖర్చులు పరిశీలించేందుకు ఎన్నికల కమీషన్ వరుణ్ రంగస్వామిని ఎన్నికల వ్యయ పరిశీలకులు గా నియమించినది.
శుక్రవారం కలెక్టరేట్ లోజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ అశోక్ కుమార్ లతో కలిసి ఎన్నికల వ్యయ పరిశీలకులు వరుణ్ రంగస్వామి కి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ఖర్చుల నమోదు కోసం ఏర్పాటు చేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్సు, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్ బృందాలు, మీడియా సెంటర్, ఎలక్ట్రానిక్ అండ్ సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ తో పాటు కంట్రోల్ రూమ్, గ్రీవెన్స్ కమిటీ వాటి పనితీరు తదితర అంశాలను ఎన్నికల పరిశీకులకులు పరిశీలించారు. గ్రీవెన్స్ కమిటీలో పట్టుకున్న నగదు వివరాలను ఎన్నికల పరిశీలకులకు జెడ్పీ ఇన్చార్జి సి ఈ ఓ తెలిపారు.ఈ కార్యక్రమ%శీ%లో ఆర్డీవో మధుసూదన్, జెడ్పి ఇన్చార్జి సి ఈ ఓ జ్యోతి, అదనపు డీ ఆర్ డి ఏ అంజయ్య, ఎక్సైజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్ వచ్చే వాహనాల పై స్పెషల్ డ్రైవ్

శేరిలింగంపల్లి (ఏప్రిల్ 19)మన సాక్షి

మియాపూర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్,ఎస్ఐపి నవీన్ కుమార్ మరియు సిబ్బంది ఆధ్వర్యంలో హెచ్డిఎఫ్సి బ్యాంక్ యూ టర్న్ దగ్గర రాం గ్రూట్లో వచ్చే వెహికల్స్ మీద స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా 10 టు వీలర్ వాహనాలు స్వాధీనం చేయడం జరిగింది మరియు మియాపూర్ లాండ్ ఆర్డర్ పిఎస్ లో ఎఫ్ఆర్ చేయించడం జరిగింది. మరియు విఎన్ఆర్ కాలేజ్ దగ్గర ఎస్ఐపి మల్లేశ్వర్ మరియు సిబ్బంది ఆధ్వర్యంలో రాంగ్ రూట్లో వచ్చే వెహికల్స్ ను ఒక వాటర్ ట్యాంకర్ ఒక స్కూటీ మరియు బొలెరో వెహికల్ ను సీజ్ చేయడం జరిగింది మరియు బాచుపల్లి పిఎస్ లో ఎఫ్ఐర్ చేయించడం జరిగింది.రాంగ్ రూట్ లో వచ్చి ప్రజలకు హాని కలిగే విదముగా వాహనాలను నడిపినట్లైతే చట్టపరమగ చర్యలు తీసుకోనబడుతోంది

జాతీయ సేవ పతక ప్రత్యేక శిబిరం..

విశ్వవిద్యాలయ అనుబంధ వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రారంభం..

హత్నూర, ఏప్రిల్ 19,మన సాక్షి;

జాతీయ సేవా పథకం లో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల అయినటువంటి వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల కంది, సంగారెడ్డి ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్ కం సభ్యులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని హత్నూర మండలం చిక్ మద్దూర్ గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ శిబిరం వారం రోజులు వరకు నిర్వహించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎం రామకృష్ణ (రీజినల్ డైరెక్టర్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ / గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) విశిష్ట అతిథులుగా డాక్టర్ ప్రొఫెసర్ జిల్లా సత్యనారాయణ (ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం క్రెడిటర్) మాట్లాడుతూ 7 రోజుల పాటు 45 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్,45 మంది చిక్ మద్దూర్ గ్రామ రైతులు లను దత్తత తీసుకొని వారి యొక్క వ్యవసాయ రంగ సమస్యలను, ఆరోగ్య సమస్యలపై అవగాహనను, స్వచ్ఛ భరత్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, అగ్రికల్చర్ ఇండస్ట్రీస్ ఎక్స్పర్స్ సహకారంతో తీర్చదిద్దడం జరుగుతుందని అన్నారు. డాక్టర్ కే రవితేజ ఎన్ ఎస్ ఎస్ మొయివేషనల్ స్పీకర్ , ప్రొఫెసర్ నరేందర్ రెడ్డి (బాడ్డమెంబర్ ఆఫ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ) కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి మనోజ్ కుమార్, ప్రొఫ్ డాక్టర్ సయ్యద్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పద్మారావు, డాక్టర్ పి రమేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరిక

కంగ్టి, ఏప్రిల్ 19, మన సాక్షి :-

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం నాగల్ గిద్ద మండలం ఇరాక్ పల్లి, మెగా నాయక్ తండాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. జెడ్పిటిసి రాజు రాథోడ్, మండల అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరారు. బిజెపిలో చేరిన వారికి విజయపాల్ రెడ్డి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రతి బీజేపీ కార్యకర్త ఎంపీ విజయం కోసం కృషి చేయాలని కోరారు.

ఓయూ టెక్నాలజీ కళాశాలలో సందడిగా టెక్నోస్మానియా

సికింద్రాబాద్,ఏప్రిల్ 19, మనసాక్షి

ఉస్మానియా యూనివర్సిటీ లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో జరుగుతున్న జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియ 2024 సందర్భంగా శుక్రవారం డిపార్ట్మెంట్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఫుడ్ సినర్జిసం 2024 ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ అగ్రి కల్చరల్ యూనివర్సిటి సీనియర్ ప్రోఫెసర్ డా.బి.వి.ఎస్. ప్రసాద్ రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ ప్రాసెస్ ఇంజినీరింగ్ అండ్ న్యూట్రిషన్ ఆఫ్ ఫుడ్ అనే అంశం పై ప్రసంగించారు.అనంతరం డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్టైల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో టెక్స్ క్రోమా 2024 ను నిర్వచించారు.డిపార్ట్మెంట్ ఆఫ్ అప్పారెల్ అండ్ టెక్స్టైల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ డా.పుష్పలత క్యటం త్రెడ్స్ ఆఫ్ కంటిన్యూటీ ఎవల్యూషన్ ఇన్ టెక్స్టైల్స్ అనే అంశం పై ప్రసంగించారు.తరువాత వివిధ విభాగాల ఆధ్వర్యంలో సమాంతరంగా ఒకే సారి ఐడియా ప్రెజెంటేషన్,మోడల్ మేకింగ్, క్రాస్ వర్డ్,ట్రెజర్ హంట్,క్విజ్, శారీ స్వాగ్ లాంటి కార్యక్రమాలు నిర్వచించారు. సాయంత్రం విద్యార్థులు డ్యాన్సులు,పాటలు,స్కిట్స్, కవిత్వంతో హొరెత్తించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.చింత సాయిలు,కన్వీనర్ ప్రొ.ఎస్.శ్రీను నాయక్,వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.వి.రమేష్ కుమార్,హెడ్ డిపార్టుమెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ప్రొ.వి.వి.బసవరావు, ప్రొ.బి. రాజం,ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్స్ డా.ఎ.పరశురామ్,డా.బి. పరమేశ్వర్లు ,డా.సాదం ఐలయ్య,డా.వి.భాస్కర్,డా. కె.శ్రీనివాసులు డా.ఎస్. అనిత,డా.ఎ.కవిత,డా. ధీరజ్,ఆర్.రేణు, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు శ్యామ్ సుందర్, మాధవి, ఆకాష్,పి.అఖిల, ముకేష్,జె.సాహిత్య,ఎం. సూరి దుర్గ,ఎం.అరవింద, కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ల జిల్లా అధ్యక్షు డుగా రవికుమార్ నియామకం.

నారాయణపేట టౌన్ ఏప్రిల్ 19 మనసాక్షి :-

నారాయణపేట ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ల (సాంకేతిక సహాయకుల) ఐక్య కార్యాచరణ జిల్లా కమిటీ నీ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టెక్నికల్ అసిస్టెంట్ల నారాయణపేట జిల్లా అధ్యక్షుడుగా సూర్మి రవికుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడుగా డి చంద్రశేఖర్ లను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షు డు సూర్మి రవికుమార్ మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షు డిగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షులుగాయాదవరాజు,మహిపాల్ రెడ్డి, భానుప్రియ, ప్రధాన కార్యదర్శి గాకె శంకరయ్య కార్యదర్శి గాబి హర్షవర్ధన్ రెడ్డి కోశాధికారి గాఊశన్నకార్యనిర్వాహణకార్యదర్శి కే గౌరీ శంకర్ గౌడ్తదితరులను ఎన్నుకున్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల 5 వ తరగతి పరీక్ష ఫలితాలు విడుదల.

నారాయణపేట టౌన్ , ఏప్రిల్ 19 మనసాక్షి :-

శుక్రవారం నారాయణపేట సాంఘిక సంక్షేమ గురుకులాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష – 5.వ తరగతి ఫలితాలు విడుదల కావడం జరిగిందని, ఎంపిక కాబడిన విద్యార్థులకు సంబంధిత పాఠశాలలనుండి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం తెలుపుతారని, వెంటనే విద్యార్థులు పాఠశాలలో చేరవచ్చునని సాంఘిక సంక్షేమ గురుకు పాఠశాల (బాలుర), దామరగిద్ద ప్రిన్స్ పాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత అడ్మిషన్ ఉంటుందని అనంతరం రెండవ విడత లిస్ట్ విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు.

వేసవి సెలవుల్లో ప్రేరణ తరగతులునిర్వహించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 19 మనసాక్షి :-

ఈ వేసవి సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు (ప్రేరణా తరగతులు) నిర్వహించేందుకు కార్యాచరణను రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని కి సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ వేసవి శిబిర కార్యచరణ పై చర్చించారు. ఈ వేసవి సెలవులు 45 రోజుల పాటు జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి పట్టణాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించాలని, ప్రతి ప్రభుత్వ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున ఎంపిక చేసి ఈ ప్రేరణ తరగతులకు రోజు పంపించేలా ఆయా పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రేరణ తరగతులు నిర్వహించే ప్రాంతాలలో స్థానికంగా ఉన్న గణితం, సామాన్య శాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ లో నిర్వచించే ప్రేరణా తరగతుల మాదిరిగా ఈ సారి ముందస్తు గా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో విద్యా శాఖ అధికారులు చంద్రకాంత్, శ్రీనివాస్, సాగర్, నాగార్జున రెడ్డి, రమేష్, రవికుమార్ పాల్గొన్నారు.

రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

శేరిలింగంపల్లి (19ఏప్రిల్)మన సాక్షి

పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో హస్తం గుర్తుకు ఓటు వేసి తన తండ్రి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన తనయుడు ఆర్యన్ రెడ్డి ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి వి. జగదీశ్వర్ గౌడ్ తో కలిసి మియాపూర్ డివిజన్ పరిధిలోని మియపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇలియాస్ షరీఫ్, వీరేందర్ గౌడ్, డివిజన్ నాయకులు, మహిళలు, యువకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం

శంకర్‌పల్లి: ఏప్రిల్ 19: (మన సాక్షి):

శంకర్‌పల్లి మున్సిపల్ బిజెపి ఇన్చార్జి వాసుదేవ్ కన్నా, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు గండేటి గాయత్రి గౌడ్ ల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక జరిగింది. బూత్ అధ్యక్షులుగా కిరణ్ గౌడ్ ఈ సందర్భంగా వారు నూతనంగా ఎన్నికైన బూత్ కమిటీ సభ్యులకు మండల అధ్యక్షులు బసగళ్ల రాములు గౌడ్ తో కలిసి నియామక పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు. మహిళా అధ్యక్షురాలు గాయత్రి ఆధ్వర్యంలో అజయ్, మల్లికార్జున గౌడ్, ప్రదీప్ రెడ్డి, అరుణ్, బ్రహ్మచారి, మణిదీప్, సాయి దీపక్, లావణ్య, రూపా, స్వర్ణ, హేమ, చిట్టి, అరుంధతి, పూజ పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు సురేష్ యాదవ్, రాజ్ కుమార్, వీరేందర్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ లో భారీ చేరికలు

కంగ్టి, ఏప్రిల్ 19, మన సాక్షి :-

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో బీఆర్ఎస్ మైనార్టీ సోదరులు శుక్రవారం జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, మాజీ కంగ్టి జడ్పిటిసి నగేష్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తహెర్ అలీ, మోయిన్ ఖాన్, సుబుర్, హఫీజ్, గౌస్ చిస్తి , తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీ రంగనాయకుల స్వామి వారి రథోత్సవం

గజ్వేల్,జగదేవపూర్, ఏప్రిల్,19,మనసాక్షి

జగదేవపూర్ మండల కేంద్రములోని శ్రీ రంగనాయకుల స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.
రథోత్సవంలో మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాచారం కనకయ్య పాల్గొన్నారు.
ఈ సందర్భంగా దాచారం కనకయ్య మాట్లాడుతూ రంగనాయకుల స్వామి వారి ఆశీస్సులతో మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.అనంతరం దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రఘు పంతులు,మారుతి వెంకట్ నరసింహా రెడ్డి,మన్నే ప్రకాష్,రవి మన్నే వారి కుటుంబ సభ్యులు,నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించు కుందాం

రంగారెడ్డి జిల్లా, ఆమనగల్లు ప్రతినిధి, ఏప్రిల్ 19 మనసాక్షి:

నేడే బిఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రులు హాజారవుతున్నట్టు మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యకర్తల ముఖ్య సమావేశానికి మాజీ ఎమ్మల్యే జైపాల్ యాదవ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రంలో మే 13వ తేదిన జరుగుతుంది. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన ఉద్యోగాన్ని సహితం వదులుకొని బడుగుల అభ్యున్నతే తన భవిష్యత్తు అనుకొనే అర్ఎస్ ప్రవీణ్ కుమార్ను అభ్యర్థిగా ప్రకటించడంతో ప్రత్యర్థులకు ఓటమి బయం మొదల య్యిందన్నారు. ఈ ఎన్నికలలో ప్రవీణ్ కుమార్ ను గెలిపించ డానికి ప్రత్యేక చొరవ తీసుకోని కారు గుర్తుకు ఓటు వేసెలా ప్రతి కార్యకర్త పని చేయాలని తెలిపారు. ఏప్రిల్ 25వ తేది నుండి మే 10వ తేదీ వరకు కేసీఆర్ ప్రతి నియోజక వర్గంలో బస్సు యాత్ర చేస్తూ పర్యటించ నున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలలో నెర వేరలెని హామీలను ఇచ్చి రైతులను మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్స్ పార్టీ హామిళలో పూర్తిగా విఫలమయ్యిన విషయం ప్రతి కుటుంబంలోని వ్యక్తులకు వివరించాలని కార్యకర్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో కడ్తల్ జెడ్పిటిసి దశరథ్ నాయక్,తలకొండ పల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్,మాడుగుల మాజీ ఎంపీపీ జర్పుల జైపాల్ నాయక్,మాజీ ఏఎంసి చైర్మన్ లు నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, సింగం విజయ్ గౌడ్,
మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్మి నరసింహ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎమిరెడ్డి జైపాల్ రెడ్డి,అర్జున్ రావు,ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్ష్యుడు పత్య నాయక్,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి భారీ చేరికలు

అనంతగిరి,ఏప్రిల్ 19,మన సాక్షి:

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు, సంక్షేమ పథకాలుకు ఆకర్షితులై అనంతగిరి మండలం నుండి 150 కుటుంబాలు
నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,స్థానిక శాసనసభ్యులు పద్మావతి రెడ్డి సమక్షంలో అనంతగిరి మండల పార్టీ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతనలో పార్టీలో చేరారు. నూతన చేరికలు ఖానాపురం నుండి మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గింజపల్లి రఘు,60 కుటుంబాలు పాలారం గ్రామం నుండి మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మట్టపల్లి శ్రీనివాస్ గౌడ్, వసంతపురం నుండి హనుమంతు వెంకటేశ్వర్లు 60 కుటుంబాలు చన్నుపల్లి నుండి 30 కుటుంబాలు, పాత కొత్త గోల్ తండాల నుండి పలు కుటుంబాలు వాయిల సింగారం నుండి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధారాణి పుల్లారెడ్డి ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు జెడ్పిటిసి ఉమా శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గునుకుల గోపాల్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు నాయక్, మండల నాయకులు దేగ కొండయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రంజిత్ రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించుకుంటాం

అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి భీమ్ భరత్

శంకర్‌పల్లి: ఏప్రిల్ 19: (మన సాక్షి):

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించుకుంటాం అని చేవెళ్ల నియోజకవర్గ అసెంబ్లీ ఇన్చార్జి భీమ్ భరత్ అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల, మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎంపీ అభ్యర్థి సతీమణి సీత రంజిత్ రెడ్డితో కలిసి బీమ్ భరత్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణా రాష్ట్రంలో మాదిరిగానే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ విజయ కేతనం ఎగరేస్తున్న నేపథ్యంలో అత్యంత భారీ మెజారిటీతో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని పార్లమెంట్ కు పంపాల్సిన బాధ్యతను ప్రతి కాంగ్రెస్ అభిమాని, కార్యకర్త, నాయకులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జ్యోతి బీమ్ భరత్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, పిసిసి సెక్రెటరీ ఉదయ్ మోహన్ రెడ్డి, జడ్పిటిసి గోవిందమ్మ గోపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు ప్రకాష్, మండల జనరల్ సెక్రెటరీ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఏజస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్, మండల కాంగ్రెస్ కార్యనిర్వాక అధ్యక్షులు మైసయ్య, మున్సిపల్ ప్రదాన కార్యదర్శి యాదయ్య గౌడ్, మండల ఉపాధ్యక్షులు నసీరుద్దీన్, అందురి పెంటయ్య, కొండ పెంటయ్య, ఐఎన్ టియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి శేరి అనంతరెడ్డి, సీనియర్ నాయకులు బలవంత్ రెడ్డి, మున్సిపల్ కార్యనిర్వాక అధ్యక్షులు ప్రశాంత్ కుమార్, మాజీ సర్పంచ్ లు శ్రీధర్, రాములు, కాశీనాథ్ గౌడ్, మునిసిపల్ వైస్ చైర్మన్ వెంకటరెడ్డి, కౌన్సిలర్లు తౌఫిక్, శ్రీనాథ్ గౌడ్, చంద్రమౌళి, శ్వేతా పాండురంగారెడ్డి, శంకర్, శ్రీధర్ గౌడ్, రైతు సంఘం అధ్యక్షులు యాదిరెడ్డి, మోహన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంత్ ముదిరాజ్, శరత్ రెడ్డి, ఇంద్రారెడ్డి,
శివారెడ్డి, దయాకర్ రెడ్డి, సుభాన్ రెడ్డి, కిష్టయ్య, జంగయ్య యాదవ్, బద్దం కృష్ణారెడ్డి, చేవెళ్ల బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమ్య రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు నాగమణి, మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు అమృత, సుధాకర్ రెడ్డి, సర్తాజ్, తలారి చంద్రశేఖర్, శ్రీకాంత్ ముదిరాజ్, రజినీకాంత్ గౌడ్, మల్లికార్జున్, సత్యం యాదవ్, వెంకటేష్ ముదిరాజ్, రంగారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాఘవేందర్, ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు సంజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తాం

సూర్యాపేట, ఏప్రిల్ 19, మన సాక్షి:

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో కూడా మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు . పాఠశాలలో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, కరెంటు సౌకర్యం, ఫ్యాన్లు, కంప్యూటర్ గదులు, పనితీరును అమ్మ ఆదర్శ కమిటీలు పర్యవేక్షిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో కూడా ఆదర్శ కమిటీలు సంఘ బంధం సంఘం అధ్యక్షులు పరిరక్షణలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సందీప్, తాసిల్దార్ శ్రీనివాసులు , పంచాయతీ కార్యదర్శి శ్రావణి, ఏఈలు, అశోక్, మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆనంద, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మేకల సునీత రాంబాబు ముదిరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల గొంతు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిని గెలిపించండి

అర్వపల్లి,ఏప్రిల్ 19,మన సాక్షి:

పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద భారతీయ జనతా పార్టీని ఎదుర్కోవాలంటే ప్రజల గొంతుకలైన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూర్యాపేట జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు.
శుక్రవారం అరవపల్లి మండల కేంద్రంలో సిపిఎం నిర్వహించిన భారీ ర్యాలీని ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎండి జహంగీర్ నామినేషన్ కార్యక్రమానికి సిపిఎం కార్యకర్తలు భారీ సంఖ్యలో వెళ్తున్నట్లు తెలిపారు. బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలతో రైతులను ఇబ్బందులు పెట్టినట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు,
మట్టిపల్లి సైదులు, నెమ్మది వెంకటేశ్వర్లు, కులిశెట్టి యాదగిరిరావు, సిపిఎం మండల కార్యదర్శి వజ్జ శ్రీనివాస్ యాదవ్, సిపిఎం నాయకులు, గోవింద్, అంజిబాబు, వెంకటరెడ్డి, అవిలయ, శిగా వెంకన్న, వీరస్వామి, సరోజ, రవి, అబ్బులు, పాల్గొన్నారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం..

బైక్ పై వెళ్తున్న వ్యక్తి మృతి...

అందోలు, ఏప్రిల్ 19, మనసాక్షి:

ఆగిఉన్న బస్సును ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృత్యువాత పడిన ఘటన శుక్రవారం నాందేడ్,అకోలా జాతీయ రహదారిపై సంగుపేట వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాద ఘనటకు సంబందించి ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి.. పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లంపేట రాములు(38) సంగారెడ్డిలో కుటుంబంతో కలిసి కొంతకాలంగా ఉంటున్నాడు. శుక్రవారం తన స్వగ్రామానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనం అందోలు మండలంలోని సంగుపేట గ్రామ రోడ్డు వద్ద ఆర్టీసి బస్సును బైకు బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలపాలైనాడు. అక్కడున్నవారు జాతీయ రహదారి అంబులెన్స్ కు సమాచారం అందించడంతో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ప్రమాద ఘటనకు సంబంధించి ఇంకా ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.మృతునికి భార్య, ఓ కుమారుడు ఉన్నట్లు తెలిసింది.

నేడు పెద్దకురపల్లెలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ప్రచారం

రామసముద్రం,ఏప్రిల్ 19,మన సాక్షి:

రామసముద్రం మండలంలోని పెద్దకురపల్లె పంచాయతీలో 3.30 నిమిషాలకు శనివారం మండలంలో రెండవరోజు ఎన్నికల ప్రచారం లో కార్యక్రమాన్ని పెట్టడం జరుగుతుందని వైసీపీ సర్పంచ్ రెడ్డెప్పనాయుడు , ఎంపీటీసీ రెడ్డెప్ప మైనార్టీ నాయకులు సర్దార్ బాషా ఉప సర్పంచ్ దొరబాబు వైసీపీ పార్టీ నాయకులు తెలిపారు .ఈ కార్యక్రమంలో పాల్గొనుటకు మదనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్ పెద్దకురపల్లె విచ్చేయనున్నారు.కావున వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రామసముద్రం మండల ఎంపీపీ , జడ్పిటిసి,సింగిల్ విండో ప్రెసిడెంట్, డిస్టిక్ ఎగ్జిక్యూటివ్ మెంబర్,వైస్ యంపిపి లు, సర్పంచులకు, ఎంపీటీసీలకు ,మండల స్థాయి నాయకులు ,వార్డు మెంబర్లకు , సచివాలయ కన్వీనర్లకు మరియు గృహసారతులకు ,పార్టీ కార్యకర్తలకు అదేవిధంగా ప్రింట్ అండ్ మీడియా వారికిఇదే మా ప్రత్యేక ఆహ్వానం. అందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పెద్దకురపల్లె పంచాయతీ మైనారిటీ నాయకులు నాయకులు సర్దార్ బాషా కోరుకుంటున్నారు.

మాల్ లో చలివేంద్రం ఏర్పాటు

చింతపల్లి,ఏప్రిల్ 19,మనసాక్షి:

చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర్ నగర్ లో ఊరి జగన్ కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి చైర్మన్ ఊరే లక్ష్మణ్ శుక్రవారం హైదరాబాదు నాగార్జునసాగర్ రహదారి వెంట మర్రిగూడ ఎక్స్ రోడ్ సమీపంలో ప్రయాణికుల కోసం బాటసారుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఊరే లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తీవ్రంగా ఎండలు కొడుతున్న దృశ్యం ప్రయాణికుల, బాటసారులు దాహార్తిని తీర్చుకునేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ప్రతి ఏటా ఊరే జగన్ కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరెన్నో చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మా సభాస్కర్ మరిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహ గౌడ్, పండు, సీతారాములు ఊరే యాదయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతవాతావరణంలో నిర్వహిస్తాం ఎస్పీ డాక్టర్ పి.శబరీష్

ములుగులో పోలీసు ఫ్లాగ్ మార్చ్

ములుగు ఏప్రిల్ 19, మన సాక్షి ప్రతినిధి

ములుగు జిల్లాలో పార్లమెంటు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ అన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలో ఎస్పీ ఆధ్వర్యం లో పోలీసులు ప్రత్యేకంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీల ప్రతినిధులు నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ఎలక్షన్ ప్రచారం కోసం ముందస్తు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.
ప్రజలు సైతం ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని, నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ మేకల రంజిత్, ఎస్సైలు వెంకటేష్, లక్ష్మారెడ్డి, రామకృష్ణ, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పేట లో రెండు గంటల విద్యుత్ అంతరాయం.

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 19 మనసాక్షి :-

జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు 11. కె.వి. ఫీడర్ మరమ్మత్తు పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మహమ్మద్ రఫీ తెలిపారు. యాదగిరి రోడ్ ఫీడర్ కింద సత్యనారాయణ టెంపుల్ రోడ్, పగిడిమర్రి రోడ్, డంపింగ్ యార్డ్, యాద్గిరి రోడ్, ప్రతిభ కాలేజ్ బ్యాక్ సైడ్, శాతవాహన కాలనీ, ఎస్సీ కాలనీ, పళ్ళ హనుమాన్ టెంపుల్ ఏరియా, గురుకుల స్కూల్ రోడ్ ప్రాంతాల లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. కావున విద్యుత్ వినియోగ దారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

పార్లమెంట్ ఎన్నికలలో మతోన్మాద బీజేపీ పార్టీని ఓడించండి

ప్రజా గొంతుక మట్టయ్యను ఎంపీగా గెలిపించండి

ఎంసీపీఐయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాధగోని రవి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 19, మన సాక్షి:

నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న ప్రజల మధ్య ఉంటూ ప్రశ్నించే ప్రజాగొంతుక నల్లగొండ పార్లమెంటు బిఎల్ఎఫ్ బలపరిచిన ఎంసీపీఐయు అభ్యర్థి వస్కుల మట్టయ్యను గెలిపించాలని రాష్ట్ర కార్యదర్శి గాధగోని రవి పిలుపునిచ్చారు.శుక్రవారం మిర్యాలగూడ పట్టణ హనుమాన్ పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి రాజీవ్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి పార్లమెంట్ అభ్యర్థి వస్కుల మట్టయ్య నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మట్టయ్య గత 35 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తూ ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ అనేక ఉద్యమాలు పాదయాత్రలు నిర్వహించిన ప్రజానాయకుడు మట్టయ్య అన్నారు.నీతి నిజాయితీతో కూడిన రాజకీయాలు చేస్తూ ప్రజా పోరాటాలే తన దినచర్యగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్న వ్యక్తి అన్నారు.నల్లగొండ గడ్డ కమ్యూనిస్టుల అడ్డా అని కమ్యూనిస్టులు నడయాడిన ఈ గడ్డలో వారి వారసత్వాన్ని పునికి పుచ్చుకొని ప్రజా నాయకునిగా ప్రజల మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి మట్టయ్య అన్నారు. మోడీ ప్రభుత్వం దేశంలో దేశ సంపదని ఉన్నతవరకాలకు దోశ పెడుతూ అంబానీ ఆదానిలకు ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్ముతున్నారని ఆయన ఆరోపించారు.మతం పేరా దేవుళ్ళ పేరా విభజిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నాడని దుర్మార్గమైన పాలనకు గోరి కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ప్రజలు మేల్కొలుపు మేలుకోకపోతే భారత రాజ్యాంగాన్ని మార్చి ఆ ప్లేస్లో మనువాదాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.రైతాంగం గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడతా ఉంటే నల్ల చట్టాలు తేవాలని చాలా ప్రయత్నాలు చేశాడని,దానికి రైతాంగం వేలాదిమంది దేశ నడిబొడ్డులో 13 నెలల పాటు సుదీర్ఘ పోరాటం తర్వాత దిగివచ్చి ముక్కు చెంపలు వేసుకుని మోడీ దిగివచ్చి నల్ల చట్టాల్ని పోరాట ఫలితంగా వెనక్కి తీసుకున్నాడని ఆయన గుర్తు చేశారు.నేడు ప్రజలు వాటిని అనుభవిస్తున్నారన్నారు. ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అహర్నిశలు పనిచేస్తున్న మట్టయ్యని రాజకీయాల కతీతంగా ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న,పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి ఎస్.కె నజీర్ నల్లగొండ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి ఏపూరి సోమన్న,నాగార్జున,డివిజన్ కార్యదర్శి పోతుగంటి కాశి కిరణ్, భరత్, విశాలాంధ్ర,అనిల్ ,చంద్రకళ ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

ఉరుముల మెరుపులతో వర్షం... చల్లబడ్డ వాతావరణం గాలికి నేలకొరిగిన చెట్లు

చింతపల్లి,ఏప్రిల్ 19,మన సాక్షి:

గత వారం రోజుల నుండి 40 నుండి 45 డిగ్రీల కొరకు చింతపల్లి మండలంలో కొట్టిన సూర్య ప్రతాపానికి ప్రజలు ఇళ్లలో నుండి బయటికి వెళ్ళలేకపోయారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు రోడ్లపైకి ప్రజలు రాలేకపోయారు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు ఎండ తీవ్రతను రాష్ట్ర వ్యాప్తంగా మండలాల వారిగా ప్రకటిస్తున్నప్పటికీ వడగా లుపులకు అక్కడక్కడ కొందరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. శుక్రవారం ఉదయం నుండి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని సాయంత్రం ఐదు గంటలకు ఉరుములు మెరుపులు గాలితో కూడిన వర్షం ఒకసారిగా కురయడంతో మండలంలోని వాతావరణం చల్లబడి మండల ప్రజలు స్వేద తీర్చుకున్నారు. గాలితో కూడిన వర్షం రావడంతో రోడ్లపై అక్కడక్కడ హరితహారం చెట్లు నేలకొరిగాయి. చిన్న చిన్న రేకుల షెడ్లు పై కప్పులు లేచి కింద పడ్డాయి. ఒక్కసారిగా వీచిన గాలికి మామిడి తోటలోని మామిడికాయలు నేలరాలాయి. దీంతో కొంతమంది రైతులకు నష్టం వాటిల్లింది. మార్కెట్లోకి రైతులు తరలించన ధాన్యం తడవడంతో రైతులు కొంత ఇబ్బంది ఎదురుకోవాల్సిన పరిస్థితి ఎదురయింది.

ఫ్యాన్ కు ఓటు..ప్రగతికి చోటు

ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్

రామసముద్రం,ఏప్రిల్ 19,మన సాక్షి:

మండలంలో వైసీపీ నియోజకవర్గ అభ్యర్థి నిసార్ అహ్మద్ కురిజల, ఆర్ నడింపల్లె పంచాయతీలలో ప్రజలు బ్రహ్మ రథం పలికారు. కురిజల పంచాయతీ లో వాల్మీకి మండలఅధ్యక్షులు దొడ్డిపల్లె ఆనంద్ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ పూలమాలతో ఘనస్వాగతం పలికారు. నిసార్ అహ్మద్ కి ప్రతిగ్రామంలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ "ప్యాన్ "గుర్తుకు ఓటు వేస్తే.. అభివృద్ధికి వేసినట్లుఅని మదనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ అన్నారు. మండలంలో కురిజల, దొడ్డిపల్లె, బరిడేపల్లె, గుట్టపాల్యం, ఆర్ నడింపల్లె, బలసముద్రం, ఎగువ నల్లప్పగారి పల్లె,మిట్టపల్లె గ్రామలలో "మన ఊరికి మన నిసార్ "కార్యక్రమం లో భాగంగా గడప గడపకు వై యస్ ఆర్ ఎన్నికలప్రచారాన్ని మండలపార్టీ నాయకులు పార్టీ శ్రేణులు కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారం చేపట్టారు. గ్రామాల్లోరోజు రోజుకు వైసీపీ పార్టీకి ప్రజాదరణ పెరుగుతుండ డంతో కార్యకర్తల్లో రెట్టింపు జోష్ తో ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. ప్రతి గ్రామం లోను నిసార్ అహ్మద్ కు పార్టీ శ్రేణులు శాలవులతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఇంటి ఇంటికి తిరుగుతూ జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని వివరించారు."ఫ్యాన్ "గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న అంత రాష్ట్ర నేరస్తుడు అరెస్ట్

16 లక్షల 24 వేల విలువ గల ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డి.ఎస్.పి

నల్గొండ,ఏప్రిల్ 19,మన సాక్షి:

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర నేరస్తుడ్ని శుక్రవారం అరెస్టు చేసి జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు వివరాలు వెల్లడించారు. ఈనెల 10వ తారీఖున మిర్యాలగూడ-1 టౌన్ పరిదిలో మౌర చంద్ర శేఖర్ ఊరికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో 50 వేల రూపాయలు దొంగలించినారని ఇచ్చిన పిర్యాదుకు జిల్లా ఎస్పి చందన దీప్తి ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా పెట్టి శుక్రవారం ఉదయం అందాజ 07.30 గం లకు, ఎస్సై రవి కుమార్ ఈదులగుడ చౌరస్తా వద్ద వాహన తనిఖీ చేస్తుండగా,విజయవాడ బొంబాయి కాలనీకి చెందిన దేవరకొండ రాంబాబు నేరస్తుడు అనుమానాస్పదముగా కనిపించదముతో అతని విచారించడం జరిగిందన్నారు. అతను మౌర చంద్ర శేఖర్ ఇంట్లో తాను చేసిన దొంగతనముతో పాటు పలు నేరాలను చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. జనవరి 30న మిర్యాలగూడ లోని కృష్ణ కాలనీలో ఫిబ్రవరి 9న గుడివాడలోని సత్యనారాయణ పురం సాయిరామ్ అపార్ట్‌మెంట్స్ లో18న బాపులపాడు లో ఒక తాళము వేసిన ఇంట్లో జరిగిన దొంగతనము 26న నాడు తుంగపహాడ్ గ్రా. మిర్యాలగూడ %-% రూరల్ గల తాళము వేసిన ఇంట్లో మార్చి 26న కల్వకుతి మండలం విద్యానగర్‌లో తాళము వేసిన ఇంట్లో మార్చి 29న మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డ వద్ద తాళము వేసిన ఇంట్లో ఈనెల10 న విద్యానగర్ కాలనీ, మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు. తాళము వేసిన ఇళ్లల్లో దొంగతనం చేసినట్లు గతములో రెండు రాష్ట్రాలలో అనేక ప్రాంతాలలో దొంగతనము చేసి, జైల్ జీవతము గడిపినట్లు తెలిపారు. చివరగా ఒక సంవత్సరము పాటు గుంటూరు జైల్ లో గడిపి జనవరి చివరి వారములో బయటకు రావడం జరిగిందన్నారు. మరలా తన అవసరాల నిమిత్తం దొంగతనాలు చేయుట మొదలు పెట్టగా ఈ రోజు పట్టుబడి చేసి అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు.

దొంగతనాల నియంత్రణ చర్యలపై పటిష్ఠ నిఘా:

జిల్లాలో దొంగలను పట్టుకునటకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప ప్రత్యేక బృందాలను ఏర్పటు చేసి అన్ని ప్రాంతాలలో నిఘా పెట్టి నియంత్రణ చర్యలు చేపట్టామని, జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ చందన దీప్తి తెలిపారు.ప్రజలు వారి ఇంటి పరిసరాల్లో,కాలనీల్లో,షాపులలో సిసిటివి కెమెరాలు అమర్చు కావాలని ఏదైనా సంఘటన జరిగిన వెంటనే సంబంధిత వ్యక్తుల కదలిక పై తగు చర్యలు తీసుకునుటకు వీటి ప్రాముఖ్యత చాలా అవసరం ఉంటుందని అన్నారు.కాబట్టి ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో కాలనీల్లో, షాపులలో ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత జైలు నుండి విడుదల అయిన నిందితుల పైన (జైల్ రీలిజింగ్ మానిటరీ సిస్టమ్) ద్వారా ప్రతీ నేరస్తుని కదలికల పై నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైన అనుమానిత వ్యక్తులు తమ పరిసరాలలో కనిపిస్తే డయల్ 100 గానీ సంబంధిత పోలీసు స్టేషన్ పిర్యాదు ఇవ్వగలరు అన్నారు.ఈ కేసును మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు అధ్వర్యంలో ఇన్స్ పెక్టర్ జి సుధాకర్, యస్.ఐ ఎం రవి కుమార్ ,ఫింగర్ ప్రింట్స్ ఏఎస్ఐ శివ, కానిస్టేబుళ్లు ఎస్ . వెంకటేశ్వర్లు, ఎన్ . శ్రీను, పి . నాగరాజు, కోర్ మధులను ఎస్పి అభినందించినారు .

అర్చకులు, గ్రామస్తుల పై దాడి... ఇద్దరికి తీవ్ర గాయాలు

రామసముద్రం,ఏప్రిల్19,మనసాక్షి:

తనపై అత్యాయత్నానికి పాల్పడ్డారని, వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని ఆర్. నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం గ్రామానికి చెందిన వాణేష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.తమ గ్రామంలో వాళీశ్వర ఆలయం పై గత కొంతకాలంగా ఘర్షణలు ఉండటంతో దేవాదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు స్వామి వారి. ఉత్సవ విగ్రహాలు ఇవో గ్రామంలోని వాళీశ్వర ఆలయంలో తాళాలు వేసి భద్రపరిచారన్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామానికి చెందిన జి. మనోహర్ బాబు, మల్లిఖార్జున, గంగన్న, వెంకటరెడ్డి, శ్రీనివాసులు తాళాలు పగులగొట్టి పూజలు చేయడంతో ఈవో విచారిస్తుండగా గ్రామస్తులైన నారాయణ, వాలిరెడ్డి, కృష్ణప్ప, మల్లెప్ప, అర్చకులు లోకనాథ్ దీక్షిత్ తో పాటు తనను కూడా పిలిపించారన్నారు. అయితే వారు అర్చకులను నానా దుర్భశాలు ఆడుతూ కొట్టేందుకు వెళ్లగా తాను అడ్డుకున్నందుకు తనపై, అర్చకుడు లోకేనాథ్ దీక్షిత్ పై మనోహర్ బాబు, మల్లికార్జున, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, గంగన్నలు బలమైన కర్రలతో తలపై దాడి చేసి తీవ్రంగా రక్త గాయాలు చేశారు. అడ్డుకోబోయిన తమ పెద్దమ్మ గంగులమ్మ చేయిని విరగొట్టారు. తాను రక్తం కారుతూ సృహ తప్పడంతో తమ గ్రామస్తులు చికిత్స నిమిత్తం పుంగనూరు ఆసుపత్రికి తరలించారని తెలిపారు. వారితో తమకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు లో పేర్కొన్నారు. కాగా గతేడాది కూడా వారు శివరాత్రి ఉత్సవాలలో అభివృద్ధి చేస్తున్న తనపై దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందానని, దీంతో కక్ష్య సాధింపుతో ఈ యేడాది శివరాత్రి ఉత్సవాలకు కొత్త రథం వాడాలని వారు ప్రయతించడంతో హైకోర్టు లో కేసు వేయగా విచారించిన హై కోర్టు పాత రథంనే వాడలని తీర్పు ఇచ్చిందన్నారు. దీంతో తమపై కక్ష్య కట్టి దాడి చేస్తున్నారని అర్చకులు తెలిపారు. వారు పది మంది ఉండగా అర్చకుడు ఒక్కడే వారిని ఎలా కొట్టేందుకు సాధ్యపడుతుందని అర్చకులు లోకనాథ్ దీక్షిత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇరువర్గాల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

నిసార్ అహ్మద్ కు భారీ ఘన స్వాగతం

పెద్ద ఎత్తున వైసిపి పార్టీలోకి చేరికలు

రామసముద్రం,ఏప్రిల్ 19,మన సాక్షి:

మదనపల్లి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నిసార్ అహ్మద్ రామసముద్రం మండలంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎగువపాళ్యంలోని యువత, పెద్దలు అందరూ బాణ సంచాల నడుము, డప్పు వాయిద్యాల నడుమ ఆయనకు ఘన స్వాగతం పలికి వైసిపి పార్టీలోకి పెద్ద ఎత్తున చేరారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ మీరందరూ వైసిపి కుటుంబంలో సభ్యులు అయినందుకు సంతోషంగా ఉందని, పార్టీ బలోపేతానికి అందరూ పనిచేసి ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా మిథున్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మరియు పాళ్యంలో కాలువలు,రోడ్లు మరింత అభివృద్ధి చేస్తానని, ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, శీన,తిప్పన్న, మనోహర్,ప్రశాంత్,శివ,ముకుంద,హరి,మురళి,శివ,ప్రశాంత్,మణి, నాగ, నరసింహులు, రాజేష్,ఈరప్ప, నారప్ప, వెంకటరమణ, గోవిందు,మొదలగువారు పాల్గొన్నారు.

వైభవంగా తూర్పు పాఠశాల 92వ వార్షికోత్సవం

రామసముద్రం,ఏప్రిల్ 19,మన సాక్షి:

రామసముద్రం మండల కేంద్రంలో తూర్పు ఎం పి పి ఎస్ పాఠశాల లో శుక్రవారం ఘనంగా పాఠశాల 92 వ వార్షికోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో నారాయణస్వామి, ఎంఈఓ హేమలత,ఎంఈఓ 2 ఆంజనేయులు,ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ కార్యక్రమానికి హాజరై జ్యోతి జ్వాలన చేశారు.ఎంపీడీవో నారాయణస్వామి మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలిపారు. పిల్లలు మొబైల్స్ కు దూరంగా ఉండాలని తెలిపారు. మంచి మార్గం లో నడిచి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. మండలంలోని 200 మంది పైన ఉన్న విద్యార్థులు తూర్పు పాఠశాలనేని తెలిపారు. అనంతరం పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సూపర్ లను ఎంతగానో ఆకట్టుకుంది.ఓ విద్యార్థి చేసిన జోలాలి అమ్మ లాలి సాంగ్ ప్రేక్షకులకు కన్నీరు తెప్పించింది. అనంతరం మహా కనకదుర్గ అమ్మవారి సాంగ్ తో ప్రేక్షకుల మొత్తం భక్తి పరవశంతో మునిగి తేలారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమలత, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు డాన్స్ మాస్టర్ హరి ప్రసాద్ విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పథకాల ఆకర్షితులై చేరికలు

డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 19, మన సాక్షి:-

మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్ నందు శుక్రవారం త్రిపురారం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బహునూతల నరేందర్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సుమారు 200 మందితో పార్టీలో చేరారు.వారందరికీ డిసిసి అధ్యక్షులు కేతవత్ శంకర్ నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలు అమలు చేసే విధానం నచ్చి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించడం కోసం కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ వెంకటేశ్వర్లు మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు అంబటి సోమయ్య పెద్దదేవులపల్లి ఎంపీటీసీ అంబటి రాము ,పసుల శ్రీకాంత్ సింగం ముత్తయ్య, గాలి మల్లేష్, గుండెబోయిన రామయ్య ,బుడిగే సోమన్న, కొల్లి రాజు, కొల్లి రవి, ఐఎన్ టిసి పట్టణ అధ్యక్షులు చాంద్ పాషా ఎస్సి సెల్ పట్టణ అధ్యక్షులు సురేష్, దైద సురేష్,దైద రవి, వెంకటేశ్వర్లు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.